TJ99 NEWS అనుక్షణం జనం కోసం

WWW.TELUGUJYOTHIDAILY.COM
www.epapertelugujyothidaily.com
PRGI NO TGTEL/25/A2223

# తెలుగు జ్యోతి

అనుక్షణం జనం కోసం
జాతీయ దినపత్రిక

## విలేకరులు కావలెను

తెలుగు జ్యోతి జాతీయ దినపత్రిక

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో వెలుబడుతున్న తెలుగు దినపత్రికలో పనిచేయుటకు జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు నియోజకవర్గాల వారిగా ఆర్సి ఇన్చార్జీలు మండలాల వారీగా విలేకరులు కావలెను అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి...?

97009 59506

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి: 02 | సంచిక: 28 | ఎడిటర్ : దువ్వల శేఖర్ యాదవ్ | శనివారం 13 జూన్ 2026 | పేజీలు : 6 | వెల : 4-00

PUBLISHED FROM : HYDERABAD, CIRCULATED TO HYDERABAD, WARANGAL,NALGONDA, KHAMMAM,RANGAREDDY, KARIMNAGAR, AMARAVATI,KADAPA,SRIKAKULAM

# చినుకు.. వణుకు

- నగరంలో కొత్తగా రోడ్డెక్కిన వాహనాలు 5.35 లక్షలు
- ఏడాది కాలంలో మరింత విస్తరించిన జనావాసాలు
- కుంచించుకుపోయిన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ
- గతేడాది 18 మార్లు ట్రాఫిక్‌ను అస్తవ్యస్తం చేసిన వర్షాలు
- ఆరుసార్లు గ్రిడ్‌లాక్ దుస్థితి
- ఈసారి అదే స్థాయి వానలు కురిస్తే పరిస్థితి చేయిదాటే ప్రమాదం



**హైదరాబాద్**

వానాకాలం వచ్చేసింది.. మండే ఎండల నుంచి ఉపశమనం కలిగింది..కానీ, హైదరాబాద్ నగరానికి ముచ్చెమటలు పడుతున్నాయి. చినుకు రాలితే వణికిపోతోంది. గతేడాది భారీ వర్షాలతో నగరం అతలాకుతలమైన విషయం తెలిసిందే. కానీ, అదేస్థాయి వానలు ఈసారి కురిస్తే అంతకంటే ఎక్కువ ఆగమాగమయ్యే పరిస్థితి నెలకొనడమే దీనికి కారణం. నగరంలో ఏదైనా సమస్య నెలకొంటే ముందుగా అటువైపు వాహనాలను నియంత్రిస్తారు, లేకుంటే ఆ రూట్ ట్రాఫిక్‌లో చిక్కుకుంటుంది. గత ఏడాది భారీ వర్షాలు, భయంకర ట్రాఫిక్ జామ్‌లను సృష్టించిన ప్రాంతాల్లో కొత్తగా వేల సంఖ్యలో వాహనాలు వచ్చి చేరుతున్నాయి. అందుకే నగరం ఇప్పుడు వణికిపోతోంది. పైగా నగరం మరింత విస్తరించింది..కొత్త జనావాసాలు వెలిశాయి. ఇతర జిల్లాలు, ఏపీ నుంచి నగరానికి వచ్చే వాహనాల సంఖ్యా పెరిగింది. - మిగతా3లో

## నీట్ రీ ఎగ్జామ్‌లో మార్పులు

- రఫ్ వర్క్ పేజీల రెట్టింపు
- సమయాన్ని పెంచిన ఎన్‌టీఏ
- పరీక్ష ప్రారంభానికి ముందు, ముగిసిన తర్వాత ఇన్విజిలేషన్ ప్రక్రియకు పెంచిన సమయం ఉపయోగపడుతుందని వెల్లడి
- రఫ్ వర్క్ కోసం ఇచ్చే పేజీలను రెట్టింపు చేసినట్లు వివరణ



# రైతుల ప్రయోజనాలే ప్రధాన లక్ష్యం



- 'వచ్చే వేసవిలోగా మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతు పనులు పూర్తిచేస్తాం'
- మేడిగడ్డ బ్యారేజీ పనులను పరిశీలించిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి
- బీఆర్ఎస్ తప్పుడు నిర్ణయాలతో బ్యారేజీలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్న ఉత్తమ్
- రైతుల ప్రయోజనాలు, ప్రాజెక్టుల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్న మంత్రి

**హైదరాబాద్**

వచ్చే ఏడాది వేసవి నాటికి మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం పనుల్లో వేగం పెంచింది. సాంకేతిక, హైడ్రలాజికల్ అధ్యయనాలు పూర్తి చేయడంతో పాటు సెప్టెంబర్ నాటికి పునరుద్ధరణ డిజైన్లు సిద్ధం చేయాలని భావిస్తోంది. పనులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి పనులను పర్యవేక్షిస్తుండటంతో కాళేశ్వరం పనులు ఊపందుకున్నాయి. ఇప్పటికే కొన్ని కీలకమైనవి పూర్తికాగా మరికొన్ని పరీక్షలు శరవేగంగా సాగుతున్నాయి. కాళేశ్వరం బ్యారేజీ మరమ్మతు పనులు చకచకా సాగుతున్నాయి. గోదావరికి, ప్రాణహితకు వరద ముందుగా ప్రారంభమైతే కొన్ని పరీక్షలకు ఇబ్బంది ఉంటుందని - మిగతా3లో

## ఐక్యంగా పోరాడదాం



- మోదీ సర్కార్‌పై ప్రజల్లో ఆగ్రహం
- వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమిదే విజయం: రాహుల్ గాంధీ
- వచ్చే ఎన్నికల్లో పోలింగ్ నిష్పక్షపాతంగా జరగకపోవచ్చు
- విమర్శలనే విమర్శలు మించి నీలకంఠుడిని నేను
- ఇండియా కూటమి మీటింగ్‌లో రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు

## బంకుల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై ఆంక్షలు

- సంక్షోభం వేళ కేంద్రం కీలక నిర్ణయం
- పశ్చిమాసియాలో అంతకంతకు ముదురుతున్న యుద్ధం
- హర్మూజ్ జలసంధి మూసివేతతో ముడి చమురు రవాణాకు ఇబ్బందులు

## ఓట్ చోరీ లేకుంటే సీట్ చోరీ మాత్రమే

# బీజేపీకి తెలుసు



- మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం వద్ద ఎటువంటి చర్చ జరగలేదు
- తెలంగాణకు వచ్చివెళ్లేందుకు, పోటీ చేసేందుకు పవన్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది : రేవంత్?రెడ్డి
- మీనాక్షి నటరాజన్ వ్యవహారంలో ఆర్వో బీజేపీ కార్యకర్తలా వ్యవహరించారన్న సీఎం?
- బీజేపీ నేతలు కిమ్ జాంగ్‌లాగే ప్రవర్తిస్తున్నారని విమర్శ
- కిమ్ లాగనే బీజేపీ నేతలు తీరు

**హైదరాబాద్**

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ, తెలంగాణలో పవన్ కల్యాణ్ పర్యటన, పోటీ సహా బీజేపీ నేతల తీరుపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానం వద్ద ఎటువంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు. తనకు హిట్లర్ స్ఫూర్తని జరుగుతున్న ప్రచారంపై స్పష్టత నిచ్చారు. ఇప్పటి వరకు బీజేపీ ఓటు చోరీ మాత్రమే చేసిందని, ఇప్పుడు సీట్ చోరీ కూడా మట్నదలుపెట్టిందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదన్న రేవంత్‌రెడ్డి, ఇందులో రిటర్నింగ్ అధికారి కమలం పార్టీ కార్యకర్తలా వ్యవహరించారని ఆరోపించారు. - మిగతా3లో



## సమ్మక్క సాగర్‌కు ఎన్‌వోసీ ఇవ్వండి

- ఛత్తీస్‌గఢ్ సీఎంకు ఉత్తమ్‌కుమార్ మరోమారు విజ్ఞప్తి
- హైదరాబాద్ వచ్చిన ఛత్తీస్‌గఢ్ సీఎంకు స్వాగతం పలికిన ఉత్తమ్
- సమ్మక్క సాగర్-తుపాకులగూడెం ప్రాజెక్టులకు ఎన్‌వోసీ ఇవ్వాలని కోరిన నీటిపారుదల శాఖా మంత్రి
- ఆ నివేదిక వచ్చాకే నిర్ణయం తీసుకుంటామన్న ఛత్తీస్‌గఢ్ సీఎం

**హైదరాబాద్**

సమ్మక్క సాగర్ – తుపాకులగూడెం ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి నిరభ్యంతర పత్రం ఇవ్వాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయ్?ని రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరోమారు కోరారు. హైదరాబాద్ వచ్చిన - మిగతా3లో




## మళ్లీ మొదలైన ఎల్ నినో

- ఈ వర్షాకాలంలో మరింత బలపడే ఛాన్స్ : ఐఎండీ
- పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలో ఎల్ నినో పరిస్థితులు
- నైరుతి రుతుపవనాల కాలంలో ఇవి మరింత బలపడే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ

## 2027 జనాభా లెక్కల తర్వాత భారత ఎన్నికల ముఖచిత్రమే మారనుందా?

- లేటెస్ట్ స్టడీ ఏం చెబుతుందంటే?
- 2027 జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్
- లోక్‌సభ సీట్లు 543 నుంచి 824కు పెరిగే అవకాశం ఉందన్న ఆర్థికవేత్తలు
- ఓటింగ్ పెంచేందుకు కీలక సూచనలు



# హామీల అమలులో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది...

డీఎస్సీ -2025 లో అక్రమాల పైన నిరసన
సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో "భారీ ర్యాలీ"

**తెలుగు జ్యోతి న్యూస్ ఆమదాలవలస నియోజకవర్గం** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందంటూ "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" అనే నినాదంతో ఆమదాలవలస వైసిపి కార్యాలయం నుండి వన్ వే జంక్షన్ వరకు ర్యాలీగా వెళ్లి నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయకర్త చింతాడ రవికుమార్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా రెండేళ్లుగా కాలయాపన చేస్తూ ప్రజలను వంచించారని మండిపడ్డాయి. చంద్రబాబు నాయుడు మార్క్ మోసాలపై జనాగ్రహం కట్టలు తెంచుకుందని ఆందోళనకారులు ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఈ నిరసనలను అడ్డుకోవడానికి పోలీసులు పలుచోట్ల ఆంక్షలు విధించారు. నాయకులను ర్యాలీలకు అనుమతులు నిరాకరించడం వంటి చర్యలకు పాల్పడ్డారు. అయినప్పటికీ, పోలీసుల ఆంక్షలు, అడ్డంకులను బద్దలు కొట్టుకుంటూ వైసీపీ నాయకులు, శ్రేణులు, సాధారణ ప్రజలు భారీ ఎత్తున రోడ్లపైకి వచ్చి తమ నిరసనను గళాన్ని విప్పారు. ప్రభుత్వ విధానాలు ఈ నిరసన ర్యాలీల్లో కేవలం పార్టీ కార్యకర్తలే కాకుండా అన్ని వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లి వందనం, ఆడబిడ్డ నిధి వంటి హామీలు ఎటుపోయాయని ప్రశ్నిస్తూ పెద్ద ఎత్తున తరలివచ్చారు. పెట్టుబడి సాయం, ఉచిత విద్యుత్, సాగు నీటి ప్రాజెక్టుల నిర్లక్ష్యం పై రైతులు నిరసన వ్యక్తం చేశారు. డీఎస్సీ నిర్వహణలో అక్రమాలు జరుగుతున్నాయని బాధితులు ప్లకార్డులతో నిరసన తెలిపారు రాష్ట్రం లో విపరీతంగా పెరిగిపో యిన పెట్రోల్, డీజిల్ ధరలతో పాటు నిత్యావ సర వస్తువుల ధరల పెరుగుదలపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పన్నుల బాదుడుతో సామాన్యుడి నడుం విరుస్తోందని మండిపడుతూ ప్లకార్డులను ప్రదర్శించారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక వైఖరికి, వైఫల్యాలకు వ్యతిరేకంగా నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. హామీల అమలులో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ప్రజా సమస్యలపై వైసీపీ నిరం తర పోరాటం చేస్తుందని ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆమదాలవలస నియోజకవర్గంలో ఉన్న నాలుగ మండలాల నాయకులు, సర్పంచులు ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, యువత, వైఎస్ఆర్సిపి అభిమానులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.






# శేరిలింగంపల్లి జోన్‌లో వాటర్ లాగింగ్ పై ప్రత్యేక దృష్టి మల్కాం చెరువు తనిఖీ





డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, వరద నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశం

**తెలుగుజ్యోతి శేరిలింగంపల్లి :12 జూన్:** శేరిలింగంపల్లి జోన్ పరిధిలో వర్షాకాలానికి ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా వాటర్ లాగింగ్ సమస్యలపై అధికారులు దృష్టి సారించారు. జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ ఆధ్వర్యంలో మల్కాం చెరువు, పరిసర ప్రాంతాల్లోని పలు నీటి నిల్వ ప్రాంతాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ తనిఖీలో ఉప కమిషనర్, ఇంజనీరింగ్, హైడ్రా, సాగునీటి శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెరువులో నీటి నిల్వ సామర్థ్యం, అవుట్‌లెట్ మార్గాలు, కాలువల స్థితిగతులు, డ్రైనేజీ లైన్ల పనితీరును సమగ్రంగా అంచనా వేశారు. నీటి ప్రవాహానికి అడ్డంకులు కలిగించే మురుగు, చెత్త, ఆక్రమణలను తొలగించాల్సిన అవసరాన్ని గుర్తించారు. వర్షాల సమయంలో తలెత్తే వాటర్ లాగింగ్ సమస్యలను ముందుగానే నివారించేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా డ్రైనేజీ మార్గాలను శుభ్రపరచడం, లోతు పెంచడం, చెరువులకు ఇన్‌ఫ్లో--అవుట్‌ఫ్లో మార్గాలను స్పష్టంగా ఉంచాలని అధికారులకు సూచించారు. అలాగే సమస్యాత్మక ప్రాంతాల్లో తక్షణమే మరమ్మత్తులు చేపట్టి, స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని తెలిపారు. సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పని చేస్తూ వరద ఉపశమన చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ తనిఖీతో జోన్‌లో వర్షాకాలానికి ముందు సిద్ధతలు వేగవంతం అవుతున్నాయని అధికారులు తెలిపారు.

# ట్రాఫిక్ రహిత సమాజం కోసం రాజీ లేని కృషి





ఉషముళ్ళపూడి కమాన్ నుంచి గాజులరామరం వరకు
100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి
పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ

**తెలుగుజ్యోతి వివేకానంద నగర్ కూకటపల్లి :12 జూన్ :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి కమాన్ నుంచి గాజులరామరం వరకు, వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో జరుగుతున్న 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను పి ఏ సి చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, ఉషముళ్ళపూడి కమాన్ నుంచి గాజుల రామరం వెళ్లే ఎల్లమ్మబండ రోడ్డుపై నిత్యం ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్య పరిష్కారానికి 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టినట్లు చెప్పారు. ఇప్పటికే అధికారులతో కలిసి ఉషముళ్ళపూడి కమాన్ నుంచి సిక్కుల బస్తీ వరకు పాదయాత్ర చేసి పరిస్థితులను పరిశీలించినట్లు గుర్తుచేశారు. రోడ్డు విస్తరణలో ఉన్న అడ్డంకులను తొలగిస్తూ, తగిన ప్రణాళికతో పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. రోడ్డు మధ్యలో ఉన్న బండరాళ్ల తొలగింపు, చెట్ల కొమ్మల తొలగింపు చేపట్టినట్లు చెప్పారు. పనుల సమయంలో పగిలిన మంచినీటి పైప్‌లైన్‌ను వెంటనే పునరుద్ధరించామని తెలిపారు. రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్థంబాలను స్థానభ్రంశం చేయడం కూడా జరుగుతోందని వివరించారు. రోడ్డు విస్తరణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, ఎక్కడా రాజీ పడకూడదని అధికారులకు ఆదేశించారు. రోడ్డు డివైడర్ మధ్యలో సుందరీకరణ పనులు కూడా చేపట్టాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని చెప్పారు. ఈ రోడ్డు విస్తరణ వల్ల ప్రజలకు సమయం, ఇంధనం ఆదా అవుతాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్య నివారణకు నాణ్యమైన, మన్నికైన రోడ్లు నిర్మించి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ప్రజలకు ట్రాఫిక్ రహిత, సౌకర్యవంతమైన జీవనం అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, మౌలిక వసతుల అభివృద్ధిలో ఎలాంటి లోపం లేకుండా చూసుకుంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.



## మియాపూర్‌లో ఆదిలక్ష్మి ఫుడ్ కోర్ట్ ప్రారంభోత్సవం

ముఖ్య అతిథులుగా పాల్గొన్న యలమంచి
ఉదయ్ కిరణ్, తాంద్ర రాంచందర్ గౌడ్



**తెలుగుజ్యోతి మియాపూర్ :12 జూన్ :** శేరిలింగంపల్లి పరిధిలోని మియాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిలక్ష్మి ఫుడ్ కోర్ట్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ మరియు మియాపూర్ డివిజన్ జనరల్ సెక్రటరీ యలమంచి ఉదయ్ కిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు మియాపూర్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ తాంద్ర రాంచందర్ గౌడ్ పాల్గొన్నారు. ఫుడ్ కోర్ట్ యాజమాన్యం ఆహ్వానం మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో నూతన వ్యాపార ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న యాజమాన్యానికి యలమంచి ఉదయ్ కిరణ్ శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యాపార రంగంలో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ వారి కృషి, పట్టుదలను అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువ పారిశ్రామికవేత్తలు ఉపాధి అవకాశాలను సృష్టిస్తూ సమాజాభివృద్ధికి తోడ్పడటం అభినందనీయమని పేర్కొన్నారు. వ్యాపారంలో నాణ్యత, వినియోగదారుల విశ్వాసం, సేవాభావం విజయానికి ప్రధాన సూత్రాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ ప్రాంతానికి చెందిన ప్రముఖులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, చంద్రమౌళి, వెంకటేష్, రత్నాచారి తదితరులు పాల్గొని యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ ఆదిలక్ష్మి ఫుడ్ కోర్ట్ విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## బీఆర్ఎస్ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధి చెందింది: కేటీఆర్



**తెలుగు జ్యోతి న్యూస్ కొంపల్లి :జూన్ 12** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగరానికి భారీగా మౌలిక వసతులు కల్పించి, పెట్టుబడులను ఆకర్షిస్తూ అభివృద్ధి చేశామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆధ్వర్యంలో సిఎంసీ కొంపల్లి సర్కిల్ పరిధిలోని శ్వేతా శుభం రెసిడెన్సీ వాసులు నందినగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిసి తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా రెసిడెన్సీకి చెందిన ఐటీ ఉద్యోగులు మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా జరిగేదని, ప్రస్తుతం ఐదు రోజులకు ఒకసారి మాత్రమే తక్కువ ఒత్తిడితో నీటి సరఫరా జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. అలాగే బోయిన్‌పల్లి--సుచిత్ర--కొంపల్లి--మేడ్చల్ మార్గంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫ్లైఓవర్ నిర్మాణ పనులు పర్యవేక్షణ లోపంతో రెండేళ్లుగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. మెట్రో విస్తరణలో భాగంగా కొంపల్లి మీదుగా మేడ్చల్ వరకు మెట్రో తీసుకువస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి పురోగతి కనిపించడం లేదని తెలిపారు. దీంతో నార్త్ సిటీలో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ తీవ్రంగా మారుతోందని విన్నవించారు. వారి సమస్యలను విన్న కేటీఆర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మౌలిక వసతుల నిర్వహణలో విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులను కొనసాగించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. శ్వేతా శుభం రెసిడెన్సీ వాసులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య, నిలిచిపోయిన ఫ్లైఓవర్ పనులు, నార్త్ సిటీ మెట్రో విస్తరణ అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ పోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

## విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న

కొత్తూరు తాజా మాజీ కౌన్సిలర్
మాదారం నరసింహ గౌడ్



**తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 12** కొత్తూరు మున్సిపాలిటీ తాజా మాజీ కౌన్సిలర్ మాదారం నరసింహ గౌడ్ విజయవాడలోని ప్రసిద్ధ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు పొందిన ఆయన రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాజీ వార్డు సభ్యుడు విరమోని వెంకటేష్, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మొగ్ర జనార్ధన్ రెడ్డి, డ్రైవర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. ఆధ్యాత్మికతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మాదారం నరసింహ గౌడ్, కనకదుర్గమ్మ దర్శనం అనంతరం భక్తులతో కలిసి ఆలయ విశిష్టతలను తెలుసుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది.

# ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టాలి

తల్లిదండ్రులపై పెరుగుతున్న ఆర్థిక భారం అసహ్యాంటి. నితీష్ ధర్మతేజ



**తెలుగుజ్యోతి శేరిలింగంపల్లి :12 జూన్** :శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతూ విద్యను పూర్తిగా వ్యాపా రంగా మార్చడం తీవ్రంగా ఖండించదగ్గ విషయం అని ఏఐఎస్ఎఫ్ నాయ కుడు టి. నితీష్ ధర్మతేజ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో అది కేవలం డబ్బున్నవారికే అందుబాటులో ఉండే విధంగా మారిపోతున్నదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, తగ్గిన ఆదాయాలు, పెరిగిన జీవన వ్యయం కారణంగా మధ్యతరగతి మరియు పేద కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రైవేట్ పాఠశాలలు భారీగా ఫీజులు పెంచడం తల్లిదండ్రులపై మరింత భారం మోపుతున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యారంగంపై సరైన పర్యవేక్షణ లేకుండా ప్రైవేట్ యాజమాన్యాల చేతుల్లో వదిలేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. ఫీజుల నియంత్రణపై ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రైవేట్ పాఠశాలలు తల్లిదండ్రులను పూర్తిగా దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, ట్రాన్స్‌పోర్ట్ (బస్సు) ఫీజులు, పుస్తకాలు, యూనిఫారాలు, ప్రత్యేక కార్యక్రమాల పేర్లతో అదనపు చార్జీలు వసూలు చేస్తూ వేల నుండి లక్షల రూపాయల వరకు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఒక విద్యార్థిని చదివించడం కూడా ఇప్పుడు సాధారణ కుటుంబాలకు భారంగా మారిందని అన్నారు. విద్యను సేవగా కాకుండా లాభాల వ్యాపారంగా మార్చే ధోరణిని వెంటనే అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. విద్య హక్కు అని, అది ప్రతి ఒక్కరికీ సమానంగా అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, సమానత్వం, బాధ్యత అవసరమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రత్యేక నియంత్రణ కమిటీని ఏర్పాటు చేసి ప్రైవేట్ పాఠశాలల ఫీజులపై నియంత్రణ తీసుకురావాలని కోరారు. తల్లిదండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి తక్షణ చర్యలు తీసుకునే ప్రత్యేక మెకానిజం ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రైవేట్ పాఠశాలల అక్రమ వసూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, నియమావళి ఉల్లంఘించిన యాజమాన్యాలపై శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు. ఫీజుల నిర్మాణం పారదర్శకంగా ప్రకటించాలనే నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని అన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచి, తగిన మౌలిక వసతులు కల్పించి, నాణ్యమైన బోధన అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా బడి బాట పట్టేలా చూడాలని, తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపేలా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. విద్య ద్వారా మాత్రమే సమాజం అభివృద్ధి చెందుతుందని, అందుకే విద్యను అందరికీ చేరువ చేయాలని పిలుపునిచ్చారు. ఇకపై కూడా ఈ సమస్యపై స్పందన లేకపోతే ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని టి. నితీష్ ధర్మతేజ హెచ్చరించారు. ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# వర్షాకాలానికి ముందస్తు చర్యలు.. కొత్తూరు అండర్‌పాస్‌ను పరిశీలించిన ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయ




**తెలుగు జ్యోతి న్యూస్ షాద్‌నగర్ ప్రతినిధి జూన్ 12** వర్షాకాలంలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొత్తూరు అండర్‌పాస్‌లో నీరు నిల్వ ఉండకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయ అధికారులకు ఆదేశించారు. కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని అండర్‌పాస్‌ను ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయ పరిశీలించి, షాద్‌నగర్ టోల్‌ప్లాజా ప్రాజెక్టు మేనేజర్ విశ్వనాథ్ రాజుకు పలు సూచనలు చేశారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అండర్‌పాస్‌లో నీటి నిల్వలు ఏర్పడకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, వాహనాల రాకపోకలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, గతంలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం నీటి తొలగింపునకు వినియోగిస్తున్న 40 హెచ్‌పీ మోటార్‌కు అదనంగా మరో రెండు మోటార్లు ఏర్పాటు చేసి నీటిని వేగంగా తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రాజెక్టు మేనేజర్ విశ్వనాథ్ రాజు మాట్లాడుతూ, ప్రస్తుతం 40 హెచ్‌పీ మోటార్‌తో నీటిని తొలగిస్తున్నామని, అధికారులు సూచించిన మేరకు అదనపు మోటార్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలో ట్రాఫిక్ సీఐ శంకరయ్య, టోల్‌ప్లాజా సిబ్బంది, ట్రాఫిక్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఎబోలా అలర్ట్... భయం వద్దు -- జాగ్రత్తలే రక్ష

ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వ్యాప్తి భారత్‌లో అప్రమత్తత పెంపు
ప్రభావిత దేశాల నుంచి వచ్చిన వారికి స్వీయ నియంత్రణ సూచనలు
లక్షణాలు 21 రోజుల్లో బయటపడే అవకాశం ఆరోగ్య నిపుణుల హెచ్చరిక
పుకార్లను నమ్మకుండా అధికారిక సూచనలు పాటించాలని విజ్ఞప్తి



**తెలుగుజ్యోతి బ్యూరో :12 జూన్ :** కాంగో, ఉగాండా వంటి ఆఫ్రికా దేశాల్లో వేగంగా వ్యాప్తి చెందుతున్న ఎబోలా వైరస్ ప్రపంచవ్యాప్తంగా ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమై కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రభావిత దేశాల నుంచి నేరుగా వచ్చిన వారు లేదా ఆ దేశాల మీదుగా ప్రయాణించిన వారు కనీసం 21 రోజుల పాటు స్వీయ నియంత్రణలో ఉండాలని సూచించింది. ప్రస్తుతం భారత్‌లో ఎబోలా కేసులు నమోదు కాలేదన్నప్పటికీ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల సుడాన్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఇద్దరికి అనుమానాస్పద లక్షణాలు కనిపించడంతో వారిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లో కూడా ఎబోలా పట్ల అప్రమత్తత పెరిగింది. అంతర్జాతీయ ప్రయాణికులపై ప్రత్యేక నిఘా పెట్టాలని, ముఖ్యంగా విమానాశ్రయాల్లో స్క్రీనింగ్ ప్రక్రియలను బలోపేతం చేయాలని అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఎబోలా వ్యాధి అనేది ఫిలోవిరిడే కుటుంబానికి చెందిన ఆర్థోఎబోలావైరస్ వల్ల కలిగే ఒక తీవ్రమైన, ప్రాణాంతక వైరల్ ఇన్ఫెక్షన్. ఎబోలా వైరస్, సుడాన్ వైరస్, బుండిబుగ్యో వైరస్ వంటి రకాలు ఈ వ్యాధికి కారణమవుతున్నాయి. ఈ వ్యాధిలో సగటు మరణాల రేటు సుమారు 50 శాతం వరకు ఉండగా, గతంలో 25 నుండి 90 శాతం వరకు మారుతూ వచ్చింది. ఈ వైరస్ ప్రధానంగా సోకిన జంతువుల ద్వారా మానవులకు వ్యాపిస్తుంది. ముఖ్యంగా పండ్ల గబ్బిలాలు దీనికి మూలంగా భావిస్తున్నారు. గబ్బిలాలు కొరికిన పండ్లు తినడం, సోకిన జంతువుల మాంసాన్ని సరైన రీతిలో ఉడికించకుండా తినడం ద్వారా వైరస్ మానవుల్లోకి ప్రవేశించే అవకాశం ఉంది. అలాగే ఒకసారి మనుషులలోకి వచ్చిన తర్వాత రోగుల రక్తం, శరీర ద్రవాలు, వస్తువుల ద్వారా ఒకరి నుంచి మరొకరికి వేగంగా వ్యాపిస్తుంది. ఎబోలా లక్షణాలు సాధారణంగా అకస్మాత్తుగా ప్రారంభమవుతాయి. మొదట జ్వరం, అలసట, కండరాల నొప్పి, తలనొప్పి, గొంతు నొప్పి కనిపిస్తాయి. తరువాత వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి, దద్దుర్లు, కాలేయం మరియు మూత్రపిండాల పనితీరు దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతాయి. వ్యాధి ముదిరిన దశలో అంతర్గత మరియు బాహ్య రక్తస్రావం కూడా సంభవించవచ్చు. అయితే ప్రతి కేసులో రక్తస్రావం ఉండకపోవచ్చు. ఈ వ్యాధి సంక్రమణ నుంచి లక్షణాలు బయటపడే వరకు 2 నుండి 21 రోజుల వరకు సమయం పట్టవచ్చు. ఈ కాలంలో లక్షణాలు లేకపోయినా వైరస్ ఉన్న అవకాశం ఉండటంతో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. అనుమానం ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించడం అత్యంత ముఖ్యము. ఎబోలా వ్యాప్తిని నియంత్రించడానికి అనేక చర్యలు అవసరం. రోగులను వేరుగా ఉంచడం, కాంటాక్ట్ ట్రేసింగ్, వైద్య పర్యవేక్షణ, ప్రయోగశాల పరీక్షలు, సురక్షిత అంత్యక్రియలు, అవసరమైతే టీకాలు వంటి చర్యలు కీలకం. ప్రస్తుతం ఎబోలా వైరస్‌కు మాత్రమే కొంతమేరకు టీకాలు అందుబాటులో ఉండగా, ఇతర రకాలపై పరిశోధనలు కొనసాగు తున్నాయి. ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకో వాలి. రోగుల రక్తం, శరీర ద్రవాలతో ప్రత్యక్ష సంబం ధం లేకుండా వ్యక్తిగత రక్షణ పరికరాలు ఉపయో గించాలి. ఆసుపత్రుల్లో ఇన్ఫెక్షన్ నియంత్రణ చర్యలను కఠినంగా అమలు చేయాలి. వ్యక్తిగత స్థాయిలో కూడా కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలి. చేతులను తరచుగా సబ్బుతో కడుక్కోవడం, పరిశుభ్రత పాటించడం, మాంసాహారం బాగా ఉడికించి తినడం, అనుమానాస్పద జంతువుల నుంచి దూరంగా ఉండడం అవసరం. గబ్బిలాలు ఎక్కువగా ఉండే ప్రాంతాలు, పాడుబడ్డ భవనాలు, అడవి ప్రాంతాలకు దూరంగా ఉండటం మంచిది. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం సరైన సహాయక చికిత్స అందిస్తే రోగుల ప్రాణాలను రక్షించే అవకాశాలు పెరుగుతాయి. కోలుకున్న వారిని సమాజంలో తిరిగి కలపడం, వారికి మానసిక మరియు వైద్య సహాయం అందించడం కూడా ముఖ్యమే. ప్రస్తుతం కరోనా అనుభవం నేపథ్యంలో భారతదేశం ఆరోగ్య పరిరక్షణలో మరింత సన్నద్ధంగా ఉంది. అయితే నిర్లక్ష్యం వహించకుండా ప్రతి వ్యక్తి బాధ్యతగా వ్యవహరించాలి. పుకార్లను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలి. మొత్తంగా ఎబోలా పట్ల భయపడాల్సిన అవసరం లేదు. సరైన జాగ్రత్తలు, స్వీయ నియంత్రణ, పరిశుభ్రత పాటించడం ద్వారా ఈ వ్యాధి ముప్పును నివారించవచ్చు. లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆసుపత్రిని సంప్రదించడం ద్వారా ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుంది.

# రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచి..... ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి " బాబు "పాలన






**తెలుగు జ్యోతి న్యూస్ ఆమదాలవలస నియోజకవర్గం:** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు ఈరోజు ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నిర్వహించిన వెన్నుపోటు కు రెండేళ్ళ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వ పాలనపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈసందర్భంగాఇచ్ఛాపురం నియోజకవర్గ వైయస్ఆర్ సీపీ ఇంఛార్జ్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి మరియు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి (పార్లమెంట్ ) ఇచ్ఛాపురం పరిశీలకులు దుంపల రామారావు (లక్ష్మణ రావు) మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చంద్రబాబు నాయుడు ప్రజలను మోసం చేసారని ఆరోపించారు. రాజకీయం కోసం పిల్లని ఇచ్చిన మమనే వెన్నుపోటు పొడిచారు . రెండేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడిచి, ప్రజా సంక్షేమాన్ని పక్కన పెట్టి పాలన సాగిస్తున్నారని విమర్శించారు. మహిళలకు అండగా ఉంటామని చెప్పి ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 అందిస్తామని హామీ ఇచ్చి మాట తప్పారని, నిరుద్యోగ యువతకు భరోసా కల్పిస్తామని చెప్పి డీఎస్సీ నియామకాల విషయంలో అవకతవకలకు పాల్పడి లక్షలాది మంది అభ్యర్థుల నమ్మకాన్ని వమ్ము చేశారని అన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేస్తూ భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని లక్ష్మణ రావు మండిపడ్డారు. తనను అరెస్ట్ చేశారంటూ తప్పుడు ప్రచారం చేసుకుని రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నించారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని, ప్రతి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తామని హామీలు ఇచ్చిన చంద్రబాబు ఇప్పుడు రైతులను పట్టించుకోవడం లేదన్నారు. నీకు 15000.. నీకు 15000 నీకు 18000 అంటూ హామీల వర్షం కురిపించి, వాలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని చెప్పి ప్రజలకు వెన్నుపోటు పొడిచారు . చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు ప్రజలకు సూపర్ షాక్‌గా మారాయని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ద్వారా విద్య, వైద్య రంగాలను వ్యాపారంగా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో దోచుకో దాచుకో పంచుకో అనే విధానం కొనసాగుతోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్పర్సన్ పిరియ విజయ సాయి రాజ్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఇచ్ఛాపురం పరిశీలకులు దుంపల రామారావు (లక్ష్మణ రావు), నర్తు నరేంద్ర, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉలాల భారతి దివ్య, ఎంపీపీలు , జడ్పీటీసీ లు, ఎంపీటీసీ లు, ఎక్స్ సర్పంచ్ లు తదితర నాయకులు పాల్గొన్నారు.

# తరుగు, రవాణా పేరుతో రైతుల వద్ద నుంచి 12 వందల కోట్లు కప్పం కట్టించుకున్న సిగ్గులేని ప్రభుత్వం ఇది

రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్ ఎత్తివేసే కుట్ర

అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యవసాయశాఖ పై సీఎం రివ్యూ లేదు

మట్టి తల్లిని అలుసుగా చూస్తూ వ్యవసాయాన్ని కర్మకు వదిలేస్తున్నారు

ప్రభుత్వాలకు ఉక్కు సంకల్పం ఉంటే వ్యవసాయ రంగంలో అద్భుతాలు చేయవచ్చు

వికారాబాద్ జిల్లా బ్యూరో వి వెంకటేష్ చారిష్





**తెలుగు జ్యోతి న్యూస్** వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి పారిశ్రామిక వేత్తలకు ఇస్తున్న సౌకర్యాలు రైతులకు ఇవ్వాలి రైతును రాజు చేసేందుకు తెలంగాణ రక్షణ సేన ప్రత్యేక కార్యాచరణ చేపడుతుంది. తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత నల్గొండ లో ఏర్పాటు చేసిన రైతు సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడిన కవిత. నల్గొండ: వ్యవసాయరంగాన్ని, రైతులను రేవంత్ రెడ్డి సర్కార్ పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా ఎగ్గొట్టటంతో పాటు వారి నుంచే తరుగు పేరుతో వెయ్యి కోట్లకు పైగా కప్పం కట్టించుకున్న సిగ్గులేని ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన మండ పడ్డారు. నల్గొండ లో ఏర్పాటు చేసిన రైతు సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత మాట్లాడారు. ప్రభుత్వానికి ఉక్కు సంకల్పం ఉంటే వ్యవసాయ రంగంలో అద్భుతాలు చేయవచ్చని చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యవసాయ శాఖపై రేవంత్ రెడ్డి కనీసం రివ్యూ చేయలేదని విమర్శించారు. రైతులకు మేలు జరగాలంటే వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి పారిశ్రామిక వేత్తలకు ఇచ్చిన సౌకర్యాలు కల్పించాలని కవిత డిమాండ్ చేశారు. రైతుల నుంచి 12 వందల కోట్ల కప్పం రేవంత్ రెడ్డి సర్కార్ లో రైతులు విలవిలలాడుతున్నారని కవిత అన్నారు. రైతు రుణమాఫీ కాక, రైతు భరోసా రాక, యూరియ లేక, ధాన్యం కొనుగోళ్లు లేక, సాగు నీళ్లు లేక అవస్థలు పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు మేలు చేయాల్సి ఉండగా సిగ్గు లేకుండా ఉల్టా వారి నుంచే కప్పం కట్టించుకుంటున్నారని అన్నారు. క్వింటాల్ కు 6 కిలోల తరుగు తీస్తూ, రవాణా ఛార్జీలు రైతులపైనే వేస్తూ దాదాపు 12 వందల కోట్లు రైతుల నుంచి వసూలు చేయటం దారుణమని కవిత అన్నారు. రైతుల కష్టాలను తీర్చాల్సిన ముఖ్యమంత్రి ఇప్పటి వరకు వ్యవసాయ శాఖపై కనీసం ఒక్కసారి కూడా రివ్యూ చేయలేదన్నారు. బకాయి పడిన రైతు భరోసా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 36 శాతం మంది కౌలు రైతులే ఉన్నారని వారిని గుర్తించి రైతు భరోసా ఇవ్వాలని కవిత కోరారు. రైతు కూలీలకు కూడా ప్రభుత్వం ఇస్తామన్న 12 వేలు ఇవ్వాలన్నారు. రాజకీయ అవసరాలు ఉన్నప్పుడే మాత్రమే రైతు భరోసా వేస్తామంటే రైతులు అన్ని విషయాలు గమిస్తారని. ..సరైన సమయంలో బుద్ధి చెబుతారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ముఖ్యంగా నల్గొండ జిల్లాలో రైతులు సాగు నీరు లేక ఇబ్బంది పడుతున్నారని కవిత అన్నారు. ఇక్కడ రిజర్వాయర్లు కట్టాలని కోరినప్పటికీ పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరంగల్ రిజర్వాయర్లు ఉంటే నల్గొండ లో కాలువలు ఉన్నాయన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ లో భాగంగా పాలమూరు నీళ్లు వచ్చే అంశమే తప్ప నల్గొండ, రంగారెడ్డి జిల్లాలకు నీళ్లిచ్చే అంశాన్ని ముఖ్యమంత్రి మాట్లాడటం లేదని కవిత విమర్శించారు. నల్గొండ, రంగారెడ్డి జిల్లాలకు నీళ్లిచ్చే ఏర్పాట్లు చేయాలన్నారు. దిండి ప్రాజెక్ట్ సోర్స్ పాయింట్ ను మార్చి నల్గొండ, పాలమూర మధ్య వివాదం లేకుండా చేయాలన్నారు. అసైన్డ్ భూములకు పట్టాలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్...ఇప్పుడు అసైన్డ్ భూములను పరిశ్రమ పేరుతో లాక్కుంటుందని మండిపడ్డారు. జిల్లాకు చెందిన మంత్రి ఒకరు వందల ఎకరాల అసైన్డ్ భూములను కొని పెట్టుకుంటున్నారని...ఎన్నికల చివరి ఏడాది అసైన్డ్ భూములకు ప్రభుత్వం రైట్స్ ఇస్తుందని ఆయన ఇదంతా చేస్తున్నారని చెప్పారు. అసైన్డ్ భూములను కాపాడుకోవాల్సిన అవసరముందని...అందుకు ప్రజలంతా పోరాటానికి సిద్ధం కావాలని కవిత పిలుపునిచ్చారు. ఉచిత విద్యుత్ ఎత్తివేసే కుట్ర రేవంత్ రెడ్డి సర్కార్ రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్ ను ఎత్తివేసే కుట్ర చేస్తోందని కవిత అన్నారు. రైతు డిస్కం పేరుతో చేస్తున్న ఈ ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాల్సిన అవసరముందని చెప్పారు. కొత్త డిస్కం ను ఏర్పాటు చేసి ఇప్పుడు ఉన్న వాటిలో ఒక డిస్కం ను ప్రైవేట్ పరం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రైతు డిస్కంను ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాటు చేయాలని ప్రయత్నించటం ద్వారానే అందులో కుట్ర ఉన్న విషయం అర్థమవుతుందన్నారు. ఈఆర్సీ పబ్లిక్ హియరింగ్ ఏర్పాటు చేయటం కారణంగా ఆ విషయం బయటకు తెలి...

# డంపింగ్ యార్డ్ చెల్లింపుల అవకతోకలపై ఏసీబీ విచారణ జరపాలన్న ఆకుల సతీష్ ముదిరాజ్

డంపింగ్ యార్డ్ చెలింపులలో సుమారుగా మూడు కోట్లు పైగా చేతులు మారినట్లు అనుమానం

డంపింగ్ యార్డ్ రవాణా కాంట్రాక్టులు, చెల్లింపుల అక్రమాలపై సిఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు: ఆకుల సతీష్







**నిజాంపేట్ తెలుగు జ్యోతి ప్రతినిధి జూన్ 12** నిజాంపేట్ మున్సిపల్ సర్కిల్ పరిధిలో డంపింగ్ యార్డ్ నుండి జవహర్‌నగర్‌కు చెత్త రవాణా కాంట్రాక్టులు, బిల్లుల చెల్లింపులు, నకిలీ పత్రాల సృష్టి, ప్రజాధన దుర్వినియోగం జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ సిఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త ఆకుల సతీష్. 2023 నుండి 2025 మధ్యకాలంలో చెత్త రవాణా కాంట్రాక్టులకు సంబంధించి సుమారు రూ. 3.40 కోట్ల చెల్లింపుల్లో అక్రమాలు జరిగి ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. అసలు కాంట్రాక్టర్ కె. చంద్రశేఖర్‌కు చెల్లించాల్సిన నిధులు నకిలీ సంస్థ ద్వారా మళ్లించబడ్డాయనే ఆరోపణలపై విజిలెన్స్ విచారణ జరపాలని కోరినట్లు తెలిపారు. ఫిర్యాదులో అప్పటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ధీరజ్ కుమార్ (ప్రస్తుతం డిప్యూటీ ఇంజనీర్, సేరిలింగంపల్లి), మాజీ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, ప్రస్తుత డిప్యూటీ కమిషనర్ సబీర్ అలీ మరియు ఇతర సంబంధిత అధికారుల పాత్రపై పారదర్శకంగా సమగ్ర విచారణ నిర్వహించాలని కోరమన్నారు. డంపింగ్ యార్డ్ రవాణా కాంట్రాక్టులు, టెండర్ ప్రక్రియ, బిల్లుల చెల్లింపులు, మెజర్‌మెంట్ బుక్స్, జీఎస్టీ నమోదులు, బ్యాంకు ఖాతా వివరాలు సహా అన్ని సంబంధిత రికార్డులను పరిశీలించి నిజానిజాలను వెలుగులోకి తీసుకురావాలని ఆయన కోరారు. ప్రజాధనం దుర్వినియోగం జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ నిధులను తిరిగి రికవరీ చేయాలని ఫిర్యాదులో కోరినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై పారదర్శకంగా, స్వతంత్రంగా 2020-2025వరకు సివిల్ వర్క్స్ ఱ డంపింగ్ యార్డ్ చెల్లింపు పై విచారణ నిర్వహించి బాధ్యులుగా తేలిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. నిధులు మళ్లింపులో అవకతవకలు జరిగినట్లు పూర్తి ఆధారాలతో సిఎంసి కమిషనర్ కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# కొత్తూరులో ఆకస్మిక తనిఖీ.. అభివృద్ధి పనులపై అడిషనల్ కలెక్టర్ కిరణ్మయి ప్రత్యేక దృష్టి





**తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 12** కొత్తూరు మున్సిపల్ కార్యాలయాన్ని అడిషనల్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో నిర్వహిస్తున్న పరిపాలనా వ్యవహారాలు, ఆదాయ-వ్యయ రికార్డులు, పన్నుల వసూళ్ల వివరాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం, తాగునీటి సరఫరా విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం తిమ్మాపూర్‌లో నిర్మిస్తున్న కంఫర్ట్ యాడ్, అమృత్ వాటర్ ట్యాంక్ పనులతో పాటు నగరాభివృద్ధిలో భాగంగా రూ. 80 లక్షల వ్యయంతో చేపడుతున్న పార్కు నిర్మాణ పనులను పరిశీలించారు. డబుల్ బెడ్‌రూమ్ గృహాల నిర్మాణ పురోగతిపై కూడా ఆరా తీశారు. మున్సిపాలిటీలో ఇంటి పన్నుల బకాయిలు అధికంగా ఉండటంపై స్పందించిన అడిషనల్ కలెక్టర్, దీనిపై ఉన్నతాధికారులతో చర్చించి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. అక్రమ షెడ్లు, అనుమతుల్లేని లేఅవుట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అలాగే అన్ని రకాల పన్నుల వసూళ్లను వేగవంతం చేసి మున్సిపాలిటీ ఆదాయ వనరులను పెంపొందించాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీలో మున్సిపల్ కమిషనర్ బాలాజీతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మియాపూర్‌లో విషాదం -- 6వ అంతస్తు నుంచి పసికందుతో దూకిన తల్లి మృతి

డిప్రెషన్ కారణంగా ఆత్మహత్య అనుమానం

శిశువుకు స్వల్ప గాయాలు



**తెలుగుజ్యోతి మియాపూర్: 12 జూన్ :** మయూరి నగర్‌లో శుక్రవారం (12.06.2026) మధ్యాహ్నం సుమారు 03:45 గంటల సమయంలో విషాద ఘటన చోటుచే సుకుంది. మయూరి నగర్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి శ్రీమతి ఈషా సాహూ (37) తన ఆరు నెలల పసికందుతో కలిసి అపార్ట్‌మెంట్ భవనం 6వ అంతస్తు నుంచి దూకినట్లు సమాచారం. ఈ ఘటనలో ఈషా సాహూ సంఘటనా స్థలంలోనే మృతి చెం దారు. పసికందుకు స్వల్ప గాయా లు మాత్రమే కావడంతో సమీపంలోని ఫెన్సింగ్ కారణంగా పెద్ద ప్రమాదం తప్పినట్లు తెలుస్తోంది. శిశువును వెంటనే వైద్య పరీక్షలు మరియు చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. మృతురాలు గత 11 సంవత్సరాలుగా వివాహితురాలు. ఆమెకు భర్తతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె విడి (8), చిన్న కుమార్తె వాణి (6 నెలలు). భార్యాభర్తలు ఇద్దరూ ప్రైవేట్ ఉద్యోగాల్లో పనిచేస్తూ హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ప్రాథమిక విచారణలో, రెండవ సంతానం జననం అనంతరం గత ఆరు నెలలుగా ఈషా సాహూ డిప్రెషన్‌తో బాధపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# ప్రభుత్వ భూమి ఆక్రమణ.. అధికారులకు అడ్డంకి, ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపులు..!

ఫిరోజ్ ఖాన్‌పై కేసు నమోదు




**తెలుగు జ్యోతి న్యూస్ జీడిమెట్ల జూన్ 12** ప్రభుత్వ భూమిని అక్రమంగా ఆక్రమించి అనధికార నిర్మాణం చేపట్టడమే కాకుండా, కూల్చివేతకు వచ్చిన రెవెన్యూ అధికారుల విధులకు అడ్డంకులు సృష్టించి బెదిరింపులకు పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల రెవెన్యూ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెహ్రూ నగర్‌కు చెందిన ఫిరోజ్ ఖాన్‌పై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 132, 226 నుంచి 329 కింద క్రైమ్ నెం. 558/2026 నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదు ప్రకారం, గాజులరామారం గ్రామ పరిధిలోని సర్వే నెం. 79లో ఉన్న ప్రభుత్వ భూమిని ఫిరోజ్ ఖాన్ అక్రమంగా ఆక్రమించి, అక్కడ అనధికార నిర్మాణం చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జూన్ 11న రెవెన్యూ అధికారులు నిర్మాణాన్ని తొలగించేందుకు సంఘటనా స్థలానికి వెళ్లగా, నిందితుడు వారి విధులకు ఆటంకం కలిగించినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా, నిర్మాణాన్ని కూల్చివేస్తే ఆత్మహత్య చేసుకుంటానంటూ అధికారులను బెదిరించినట్లు ఫిర్యాదులో వెల్లడైంది. ప్రభుత్వ అధికారులను వారి విధుల నిర్వహణలో అడ్డుకోవడం, బెదిరింపులకు పాల్పడడం వంటి ఆరోపణలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

# నందిగామ మండలం ఉప సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆవులమంద శివశంకర్

నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా సన్మానం



**తెలుగు జ్యోతి న్యూస్ షాద్ నగర్ ప్రతినిధి జూన్ 12** గ్రామాల అభివృద్ధి కోసం ఉప సర్పంచ్‌లు పార్టీలకు అతీతంగా పనిచేసి పారదర్శక పాలన అందించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. నందిగామ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటైన మండల ఉప సర్పంచ్‌ల సంఘం కార్యవర్గ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన, ప్రగతి ప్రణాళికల ద్వారా గ్రామాల అభివృద్ధికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు తమ పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా బాధ్యతాయుతంగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మండల ఉప సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన చేగూరు ఆవులమంద శివశంకర్‌ను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి అభినందించారు. నూతన కార్యవర్గం గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఎడ్ల వెంకటేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సార వెంకటేష్ గౌడ్, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్, బాల్‌రాజ్, ఫరూఖ్‌నగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయికల్ శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# నూతన గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్న మాద్రి పృథ్వీరాజ్.







**తెలుగు జ్యోతి న్యూస్ జూన్ 12 రంగారెడ్డి ప్రతినిధి.** పటాన్చెరు మండలం ఇంద్రేశం మున్సిపల్ కేంద్రం పార్వతీపురం కాలనీలో నిర్వహించిన శ్రీమతి నాగరాణిబి విద్యాసాగర్ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. వారి కొత్త ఇంటిలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు నిండాలని ఆకాంక్షించారు. కొత్త ఇంటిలో కొత్త ఆనందాలు వెల్లి విజయాలని కోరుతూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పటాన్చెరు మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, రాజు, ప్రశాంత్, విజయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ బాల కార్మిక దినోత్సవం సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి.




**తెలుగు జ్యోతి న్యూస్ 12 జూన్ సంగారెడ్డి ప్రతినిధి.** నేడు ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, తెలుగు జ్యోతి సంగారెడ్డి ప్రతీదితో మాట్లాడుతూ బాల్యం పనికి కాదు చదువుకు స్వప్నలకు ఉపయోగ పడాలని, ప్రతి బిడ్డకు విద్య, ఆరోగ్యం, రక్షణ లభించాలి అని చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తెలియజేశారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని మనమందరం కృషి చేద్దామని కొనియాడారు. ముఖ్యంగా పటా న్చెరు నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున ఎక్కడ కూడా బాల కార్మిక వ్యవస్థ ఉండకుండా అధికారులు పటిష్టమైన నిఘా ఉంచాలని, ఎవరైనా ఏ పరిశ్రమలోనైనా బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తిస్తే ఆయా యజమానులపై కఠినమైన ప్రభుత్వ అధికారులు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. నేటి బాలురే రేపటి దేశ పౌరులు కాబట్టి ప్రతి ఒక్క బాల ,బాలికలు చదువుకున్నప్పుడే ఈ ప్రపంచం అభివృద్ధి పథంలో నడుస్తుందని, ముఖ్యంగా మన దేశం ప్రజాస్వామ్య దేశం కాబట్టి రాజ్యాంగం ప్రకారం ఎవరి హక్కులు వాళ్లకు లభించే విధంగా బాల కార్మిక వ్యవస్థను రూపుమాపే విధంగా మనమందరం ముందుకు సాగాలని, ప్రతి ఒక్కరూ ఉన్నతమైన చదువులు చదివించే విధంగా కృషి చేయాలి అన్నారు. బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి తెలియజేశారు.

# వెంకట రామ శివ ఆలయ కమాన్ నిర్మాణ పనులను ఆపిన హైడ్రా, టౌన్ ప్లానింగ్ అధికారులు

**పిల్లర్లను తొలగింపు ను అడ్డుకున్న మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్**

**ఆలయ కమాన్ నిర్మాణాన్ని తొలగించడంపై మండిపడ్డ స్థానికులు**

**హిందూ మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్న అధికారులు**

**ఆలయ కమాన్ నిర్మాణానికి అనుమతులను కోరమన్న ఆలయ చైర్మన్ ఆగం రాజు**





**నిజాంపేట్ తెలుగు జ్యోతి ప్రతినిధి జూన్ 12** నిజాంపేట సర్కిల్ బాచుపల్లి కౌసల్య కాలనీలో నూతనంగా నిర్మించిన వెంకట రామ శివ ఆలయ కామాన్ కౌసల్య కాలనీ లోపలికి వచ్చే రోడ్డు దగ్గర ఆలయ కమిటీ సభ్యులు, కాలనీవాసుల ఆధ్వర్యంలో కమాన్ నిర్మిస్తుండడంతో కొంతమంది వ్యక్తులు పనికట్టుకుని రోడ్ బ్లాక్ చేసి అక్రమ గుడి కమాన్ నిర్మిస్తున్నారని మున్సిపల్, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం హైడ్రా, సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు దానిని తొలగించే ప్రయత్నం చేశారు. గుడి కమాన్ తొలగిస్తున్నారని విషయం తెలుసుకున్న ఆలయ చైర్మన్, మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ కమిటీ సభ్యులతో కలిసి ఘటన స్థలానికి చేరుకొని కూల్చివేతలు ఆపివేయాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆగం రాజు మాట్లాడుతూ మేము ఇక్కడ ఆలయ కమాన్ నిర్మిస్తున్నామని నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కు , టౌన్ ప్లానింగ్ ఏసిపి, ట్రాఫిక్ పోలీసులకు వినతి పత్రం అందజేశామని తెలిపారు. ఇక్కడ నిర్మిస్తున్న కమాన్ ప్రదేశాన్ని ఏసిపి పర్యటించి పరిశీలించారని వారు ఎవరికి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని కోరారు . విషయాన్ని ఎమ్మెల్సీ షబ్బీర్ రాజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద దృష్టికి కూడా తీసుకొని వెళ్దామని వారు కూడా ఆలయ కమాన్ నిర్మాణానికి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఎవరో కొంతమంది గిట్టని వారు అధికారులకు తప్పుడు సమాచారం అందించి తప్పుదోవ పట్టించారని ఏదైనా సమస్య ఉంటే మాకు తెలిపి ఉంటే మేమే వారితో మాట్లాడి సమస్య అరిస్తూ పరిష్కరించుకునే వారమని తెలిపారు. అధికారులు ఎవరో ఇచ్చిన తప్పుడు సమాచారంతో వారు ఇప్పుడు వచ్చి దీనిని తొలగించడం హిందువుల మనో భావాలను దెబ్బతీయడం అన్నారు. కమాన్ స్లాబు, పిల్లర్లు తొలగించడం బాధాకరం అన్నారు. మేము మా ఇంటి కోసమో, ఎవరి స్వార్థం కోసం, దేనికోసం ఇక్కడ పనులు చేయలేదని కేవలం కాలనీలో నిర్మించిన వెంకట రామ శివాలయం ఆలయం ప్రజలకు తెలియాలని ఇక్కడ కమాన్ నిర్మిస్తున్నామని అధికారులకు తెలిపారు. అధికారులు ఇది గమనించి మాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ కమాన్ నిర్మించుకోవడానికి సహకరించాలని కోరారు. ఇక్కడ కమాన్ నిర్మించడానికి మేము ఎక్కడికైనా వెళ్తామని తెలిపారు. అవసరమైతే సీఎంసీ జోనల్ కమిషనర్ను కలుస్తామని ఆగం రాజు తెలిపారు అదే విధంగా కాలనీ అభివృద్ధి కొరకు అందరం కలిసి కృషి చేయాలి కానీ ఈ విధంగా పనులను అడ్డుకోకూడదన్నారు. ఈ కార్యక్రమంలో కౌసల్య కాలనీ స్థానికులు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



# తెలంగాణ బిజేవైఎం రాష్ట్ర కోశాధికారి నరేన్ దేశ్ పాండే







సాధికారతబి సంస్థాగత పాటు బలోపేతం యువతరానికి స్ఫూర్తినిస్తుందన్న దేశ్ పాండే.


**తెలుగు జ్యోతి న్యూస్ జోన్ 12 సంగారెడ్డి ప్రతినిధి.** మంచిర్యాల మరియు కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల పర్యటనలో భాగంగా నమో యువ జన్ బిజెడ్ కాంక్లేవ్ లో యువ మోర్చా నాయకులతో కలిసి పాల్గొని ఈ పర్యటన సందర్భంగా, నేడు యువమోర్చా నాయకులతో కలిసి యువత ఉపాధికారిత సంస్థాగత బలోపేతం మరియు యువతరానికి స్ఫూర్తినిస్తూ వారిని కిరాషీలకంగా భాగస్వామ్యం చేసే విధంగా వివిధ కార్యక్రమాలలో పాల్గొన్న తెలంగాణ బీజేవైఎం రాష్ట్ర కోశాధికారి శ్రీ నరేన్ దేశ్ పాండే.

# నవాబ్‌పేట్ మండలం చౌడూర్ గ్రామంలో భూకబ్జా కలకలం

**- భూకబ్జాకు పాల్పడ్డ వడ్ల బిచ్చయ్య సర్వే నంబర్లు 259, 150 భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపణలు**

**- వడ్ల బిచ్చయ్య, సత్యనారాయణ మరియు వారి కుమారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం డిమాండ్**






**వికారాబాద్ ప్రతినిధి -- వి ఎన్ కె చారి (తెలుగు జ్యోతి న్యూస్):** మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం చౌడూర్ గ్రామంలో భూకబ్జా వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. గ్రామానికి చెందిన వడ్ల బిచ్చయ్య అక్రమంగా సర్వే నంబర్లు 150 మరియు 259కు సంబంధించిన భూములను తన పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకుని భూకబ్జాకు పాల్పడుతున్నాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తమ తండ్రి వడ్ల రామలింగయ్యకు వారసత్వంగా వస్తున్న భూమిలో సర్వే నంబర్ 259లో 1-16 గుంటల భూమి తమ భాగానికి వస్తుందని, ఆ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు వడ్ల బిచ్చయ్య, సత్యనారాయణ మరి యు వారి కుమారులు ప్రయత్నిస్తున్నారని వడ్ల వెంకటేశం చారి తెలిపారు. ఈ విషయాన్ని ప్రశ్నించిన తమ కుటుంబ సభ్యులను “పొలం దగ్గరకు వస్తే చంపేస్తాం” అంటూ బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వడ్ల బిచ్చయ్యతో పాటు సత్యనారాయణ, రాజు, శివ, నరసింహ తమపై దౌర్జన్యాలకు పాల్పడుతూ ప్రాణహాని హెచ్చరికలు చేస్తున్నారని బాధితులు వాపోయారు. ఇప్పటికే ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు స్పందించలేదని, ఎమ్మార్వో కార్యాలయానికి పలుమార్లు వెళ్లినా సరైన న్యాయం జరగలేదని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. భూమి వద్దకు వెళ్లకుండా అడ్డుకోవడం, దుర్భాషలాడడం, భయభ్రాంతులకు గురిచేయడం జరుగుతోందని తెలిపారు. జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, జిల్లా డీఎస్పీ, కమిషనర్, ఎమ్మార్వో వెంటనే స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపి భూకబ్జాకు పాల్పడుతున్న వడ్ల బిచ్చయ్య, సత్యనారాయణ మరియు వారి కుమారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబం డిమాండ్ చేస్తోంది. తమ పూర్వీకుల భూమిని రక్షించి న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. మా కుటుంబానికి ఏదైనా అనర్థం జరిగితే దానికి పూర్తి బాధ్యత భూకబ్జాదారులదే” అని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. నవాబ్‌పేట్ మండలం చౌడూర్ గ్రామంలో భూకబ్జా కలకలం

# ముగిసిన టీజీఐఐ సీ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్

విజేతలకు బహుమతులు అందజేసిన

టి.జి.ఐ.ఐ సి చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి. ఎండి శశాంక.

**తెలుగు జ్యోతి న్యూస్ జూన్ 12 సంగారెడ్డి ప్రతినిధి.** గచ్చిబౌలి ఐ ఎస్ బి లో ఘనంగా ముగింపు వేడుకలు. రెండు రోజులపాటు ఘనంగా జరిగిన టీజీఐఐ సీ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ మూడో రోజు అయిన శుక్రవారం ఉద్యోగుల సాంస్కృతిక వేడుకలతో ముగిసింది. శుక్రవారం గచ్చిబౌలి ఐఎస్బి లోని కెన్ కా ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో టీజీఐఐసి ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. డాన్సులు చేస్తూ, పాటలు పాడుతూ ఆనందంగా గడిపారు. అనంతరం రెండు రోజులపాటు జరిగిన క్రీడా పోటీల్లో గెలిచిన విజేతలకు టి జి ఐ ఐ సి చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డి, ఎండి శశాంక లు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు వీలైనప్పుడల్లా తమ హాబీలకు పదం పెట్టాలని తద్వారా మానసిక ఉల్లాసం




పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టి జి ఐ ఐ సి




ఈడీలు పవన్, వీరారెడ్డిలతో పాటు సంస్థ ఉన్నతాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# ఖమ్మం బాలికపై జరిగిన అమానుష ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం

## -- "డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి

వికారాబాద్ జిల్లా బ్యూరో వి వెంకటేష్ చారి

**తెలుగు జ్యోతి న్యూస్,** ఖమ్మం జిల్లాలో ఓ మైనర్ బాలికపై జరిగిన అమానుష ఘటన పట్ల భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మెడికల్ సెల్ తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేస్తోందని రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ "డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి" తెలిపారు. శుక్రవారం నాడు నిమ్స్ హాస్పిటల్ లో బాలికను రాష్ట్ర మెడికల్ సెల్ కో కన్వీనర్ డాక్టర్ రష్మీ కండ్లికర్, డాక్టర్ సుమన్ లతో కలిసి బాధితురాలిని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఖమ్మం జిల్లా తల్లాంపాడు గ్రామానికి చెందిన 12 ఏళ్ల బాలిక వేసవి సెలవుల సందర్భంగా ఖమ్మం నగరంలోని రాపర్తి నగర్‌లో నివసిస్తున్న తన తాతయ్య, అమ్మమ్మల ఇంటికి వెళ్లింది. అదే అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న వ్యక్తి బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడనే ఆరోపణలు అత్యంత కలచివేసే విషయమని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఘటన బయటపడుతుందనే భయంతో బాలికను భవనం పై అంతస్తు నుంచి కిందకు తోసివేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ ఘటనలో బాలిక తీవ్రంగా గాయపడిందని, ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉందని సమాచారం అందుతోందన్నారు. శరీరంలోని పలు అవయవాలకు, రెండు కాళ్లకు తీవ్ర గాయాలైనట్లు తెలిసిందని పేర్కొన్నారు. ఈ దారుణ ఘటనను తెలంగాణ రాష్ట్ర బీజేపీ మెడికల్ సెల్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఇంతటి ఘోర నేరం జరిగినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత మంత్రులు, మహిళా సంక్షేమ శాఖ ప్రతినిధులు తక్షణ స్పందన చూపకపోవడం బాధా కరమన్నారు. నిందితుడిపై నేర తీవ్రతకు అను గుణంగా అన్ని సంబంధిత చట్టపరమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి న్యాయం జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు, మహిళా సంఘాలు, పౌర సమాజ సంస్థలు కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం బాలికకు అత్యుత్తమ వైద్య సేవలను పూర్తిగా ఉచితంగా అందించాలని, చికిత్సకు అయ్యే మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కోరారు. అలాగే బాధితురాలి కుటుంబానికి ప్రత్యేక ఆర్థిక సహాయ ప్యాకేజీ ప్రకటించడంతో పాటు కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) డైరెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించి, బాలికకు సాధ్యమైనంత ఉత్తమ వైద్య చికిత్స అందించాలని కోరినట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఎమ్మెల్యేలు తక్షణమే స్పందించి బాధితురాలి కుటుంబానికి అండగా నిలవాలని, నిందితుడికి అత్యంత కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ కొప్పుల రాజశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# జగ్గారెడ్డి దమ్ముంటే ఇంటి దొంగ పేరు బయటపెట్టు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్

మీనాక్షికి ద్రోహం చేసింది మీ పార్టీ వారే.

హరీష్ రావు నిజాలు చెబితే ఎందుకు ఉరికి పాటు.

పదవి కోసం దిగజారి మాట్లాడు మాట్లాడుతున్న జగ్గారెడ్డి.

ప్రశ్నలకు సమాధానాలు లేకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నావు.

కాంగ్రెస్ అవినీతి, అక్రమాలపై సమాధానం ఇవ్వు జగ్గారెడ్డి.



**తెలుగు జ్యోతి న్యూస్ జూన్ 12 సంగారెడ్డి ప్రతినిధి.** బి ఆర్ ఎస్ రాజకీయాలు చేస్తుందని విమర్శించేముందు కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న అంతర్గత రాజకీయాలపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని బిఆర్ఎస్ సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. మీనాక్షి నటరాజనుకు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నప్పటికీ, ఆమె నామినేషన్ ప్రక్రియను అడ్డుకునేలా సమాచారమిచ్చింది తెలంగాణ కాంగ్రెస్ నాయకులేనన్న ఆరోపణపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కామాలు, ఫుల్ స్టాప్ ల వల్లే నామినేషన్ ఆగిపోయిందని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే అని విమర్శించారు. జాతీయ పార్టీ ఇన్చార్జి స్థాయి నాయకురాలి అబిడబిట్ లో తప్పులు జరగడం కాంగ్రెస్ వై పల్లె మే అన్నారు. అలాగే, సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితుడిగా చెప్పబడుతున్న వ్యక్తి మీనాక్షి నటరాజనుకు వెన్ను పోటు పొడిచాడనే ఆరోపణలపై కాంగ్రెస్ ఎందుకు మౌనం పాటిస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ లో జరుగుతున్న అంతర్గత కొమ్ములాటలను దాచి పెట్టేందుకే బి ఆర్ ఎస్ పై విమర్శలు చేస్తున్నారని చింతా ప్రభాకర్ ఆరోపించారు. దొంగతనం చేసింది బిజెపి వాళ్లు, బురదల్లేది బిఆర్ఎస్ పైన నా? అని అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారు. మధ్యప్రదేశ్ మంత్రులే ఆధారాలతో సహా మీ తెలంగాణ కాంగ్రెస్ నాయకులు సమాచారం ఇచ్చారని కుండా బద్దలు కొడితే దానికి సమాధానం చెప్పే దమ్ము మీకు లేదు. హరీష్ రావు విమర్శలు ఊహగానాలు కావు, ఆధారాలతోనే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి అంశాలను ప్రజల ముందుకు తీసుకొస్తున్నారు అని పేర్కొన్నారు. కాంగ్రెస్ లోని కోవర్ట్ వ్యవహారాన్ని బయటపెట్టినందుకే హరీష్ రావు పై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని చింతా ప్రభాకర్ అన్నారు. మీనాక్షి నటరాజన్ వ్యవహారం పైన సీఎం రేవంత్ రెడ్డి సిట్ విచారణకు ఆదేశించి నిజాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. మీనాక్షి నటరాజనుకు ద్రోహం చేసింది ముఖ్యమంత్రివర్గమే అని తెలిసిన మీరెందుకు మాట్లాడడం లేదు జగ్గారెడ్డి? మీ నోరు ఎవరు నొక్కేశారు. ముఖ్యమంత్రి కోసం రూపాయలు 100 కోట్లతో నిర్మిస్తున్న గెస్ట్ హౌస్, యూనిఫామ్ టెండర్లు, ప్రభుత్వ వ్యయాలు, హెలికాప్టర్ అద్దె ఖర్చులు వంటి అంశాలపై హరీష్ రావు లేవనెత్తిన ప్రశ్నలకు కాంగ్రెస్ సమాధానం చెప్పాలని కోరారు. సంగారెడ్డిలో ప్రజల చేతిలో ఓటమిపాలైన జగ్గారెడ్డికి, ప్రజల గుండెల్లో ఉంటూ ఆరుసార్లు భారీ మెజార్టీతో గెలిచిన ప్రజా నాయకుడు హరీష్ రావు ను విమర్శించే నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి లాగా దొంగ హామీలు ఇచ్చి, అబద్ధాలు చెప్పి, ఢిల్లీ వాళ్ళ కాళ్లు మొక్కి పదవులు తెచ్చుకునే అలవాటు మీది. హరీష్ రావు ఎప్పుడు రైతులు ,పేదల పక్షాన పోరాడుతూ ప్రజల మధ్యనే ఉండే నాయకుడు, కానీ మీరు మాత్రం పదవి కోసం ఢిల్లీ నాయకుల చుట్టూ తిరుగుతూ సీఎం రేవంత్ రెడ్డి మెప్పుకోసం ఆరాటపడుతున్నారు. ఎవరైనా కోవర్ట్ లు ఉంటే తొడ్కలూ తీస్తామని జగ్గారెడ్డి ప్రగల్భాలు పలుకుతున్నారు. మీకు నిజంగా అంత దమ్ముంటే, ముందుగా సీటు రాకుండా అడ్డుకున్న ఆ ముఖ్యమంత్రి అనుచరుడు అయిన కోవర్ట్ పేరు బయట పెట్టండి. రేవంత్ రెడ్డి ని టిడిపి కోవర్ట్ అని, పార్టీని నాశనం చేయడానికి వచ్చిన బ్లాక్ మెయిలర్ అని గాంధీ భవన్ మెట్ల మీద కూర్చొని తిట్టిన జగ్గారెడ్డి. ఈరోజు పదవి కాపాడుకోవడం కోసం అదే రేవంత్ రెడ్డికి వంత పాడటం మీ దిగజారుడుతనానికి నిదర్శనం కాదా? ఫార్మాసిటీ రద్దుతో రాష్ట్రానికి రావలసిన పరిశ్రమలు, ఉద్యోగాలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయని రైతులుబి పేదలు బియువత సమస్యలపై సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి ఇలాంటి కుంటి సాకులు చెబుతూ మీడియా ముందు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని సంగారెడ్డి శాసనసభ్యులు చింతా ప్రభాకర్ విమర్శించారు.

## బిజినెస్

### ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సేవల్లో అంతరాయం..
### మిలియన్లకొద్దీ యూజర్ల ఫిర్యాదులు




సోషల్ మీడియా యాప్స్ అయిన ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఇండియా సహా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో వీటి సేవలు నిలిచిపోయాయి. యూజర్లకు అనేక ఆటంకాలు ఏర్పడుతున్నాయి. ఫీడ్ లోడ్ కావడం లేదు. దీంతో చాలా దేశాల్లోని యూజర్లు మెటా సంస్థకు ఫిర్యాదు చేస్తున్నారు. ఇండియాతోపాటు యూఎస్, కెనడా, ఆస్ట్రేలియా, ఫిలిప్పైన్స్, యూకే వంటి పలు దేశాల్లో ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఫీడ్ లోడ్ కావడం లేదు. యూజర్లకు కంటెంట్ రిఫ్రెష్ అవ్వడం లేదు. భారత కాలమానం ప్రకారం సాయంత్రం ఏడు గంటల నుంచి ఈ రకమైన ఇబ్బంది తలెత్తిందని యూజర్లు ఫిర్యాదు చేస్తున్నారు. అనేక దేశాల్లో వెబ్‌లో, మొబైల్‌లో ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ పేజీలు రావడం లేదని పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని పలు ఆన్‌లైన్, సోషల్ మీడియా ట్రాకింగ్ సైట్లు కూడా ధృవీకరించాయి. కొందరు యూజర్లు లాగిన సమస్యల్ని కూడా ఎదుర్కొంటున్నారు. కంటెంట్ క్రియేటర్లు చాలా ఇబ్బందులు ఈ పరిణామంపై చిరాకు పడుతున్నారు. ఎక్స్ సహా ఇతర ప్లాట్‌ఫామ్స్ వేదికగా తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. హ్యాష్‌ట్యాగ్‌లతో సోషల్ మీడియాలో ట్రెండ్ చేస్తున్నారు. అయితే, ఈ అంశంపై మెటా ఇప్పటివరకు స్పందించలేదు. దీంతో మెటా ఎప్పుడు ఈ సమస్యను పరిష్కరిస్తుందా అని యూజర్లు ఎదురుచూస్తున్నారు. డిజిటల్ యుగంలో యూజర్లు సోషల్ మీడియా వాడకుండా నిమిషాలు కూడా ఉండలేని పరిస్థితి ఉంది. అలాంటిది ప్రపంచవ్యాప్తంగా ఈ పరిస్థితి ఎదురవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

### పెరిగిన భారత్ బంగారం నిల్వల విలువ



భారత విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో స్వల్ప తగ్గుదల నమోదైనప్పటికీ, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వద్ద ఉన్న బంగారం నిల్వల విలువ గణనీయంగా పెరిగింది. ఆర్‌బీఐ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, జూన్ 5తో ముగిసిన వారంలో దేశ బంగారం నిల్వల విలువ 1.98 బిలియన్ డాలర్లు పెరిగి 114.58 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అదే సమయంలో మొత్తం విదేశీ మారక ద్రవ్య నిల్వలు 711 మిలియన్ డాలర్లు తగ్గి 681.61 బిలియన్ డాలర్ల వద్ద నిలిచాయి. ఫారెక్స్ రిజర్వుల్లో అతిపెద్ద వాటా కలిగిన విదేశీ కరెన్సీ ఆస్తులు 2.70 బిలియన్ డాలర్లు తగ్గి 543.44 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఎఫ్‌సీఏలను అమెరికా డాలర్ విలువలో లెక్కిస్తారు. అయితే ఈ నిల్వల్లో యూరో, పౌండ్ స్టెర్లింగ్, జపాన్ యెన్ వంటి ఇతర ప్రధాన కరెన్సీలు కూడా ఉండటంతో, వాటి మారకపు విలువల్లో చోటుచేసుకునే మార్పులు ఎఫ్‌సీఏపై ప్రభావం చూపుతాయి. గత వారంలో భారత విదేశీ మారక నిల్వలు సుమారు 938 మిలియన్ డాలర్లు పెరిగిన విషయం తెలిసిందే. రూపాయి మారకపు విలువలో అధిక ఒడిదుడుకులు కనిపించినప్పుడు లేదా మార్కెట్లో అసాధారణ పరిస్థితులు నెలకొన్నప్పుడు ఆర్‌బీఐ ఫారెక్స్ మార్కెట్లో జోక్యం చేసుకుంటూ నిల్వలను వినియోగిస్తుంది. ఇటీవల అమెరికా డాలర్ నిల్వలను బలోపేతం చేయడం, రూపాయి స్థిరత్వానికి మద్దతు ఇవ్వడం లక్ష్యంగా ఎఫ్‌సీఎన్‌ఆర్-బీ (ఖీజచీ=-దీ) డిపాజిట్ల హెడ్జింగ్ ఖర్చును భరించనున్నట్లు ఆర్‌బీఐ ప్రకటించింది. ప్రస్తుతం భారత రూపాయి అమెరికా డాలర్‌తో పోలిస్తే 95 స్థాయి వద్ద ట్రేడవుతోంది. ఇది ఈ ఏడాది ప్రారంభంలో నమోదైన 97 స్థాయితో పోలిస్తే మెరుగైన స్థితిగా భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో రూపాయి మారకం విలువ 94.70 నుంచి 95.60 మధ్య కదలాడే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# వడదెబ్బ కాదు.. ధరదెబ్బ..

**మేలో విజృంభించిన రిటైల్ ద్రవ్యోల్బణం**
**గత నెలలో 3.93 శాతంగా నమోదు**
**ఆహారోత్పత్తుల రేట్లు పైపైకి**
**భారీగా పెరుగుతున్న ఇంధన ధరలూ కారణమే**

**న్యూఢిల్లీ :** ఈసారి మండుటెండల్లో వడదెబ్బ సంగతేమోగానీ.. ధరదెబ్బ మాత్రం అందరికీ గట్టిగానే తగిలింది. కొనుగోలుదారుల జేబుల్ని గుల్ల చేసేలా మేలో రిటైల్ ద్రవ్యోల్బణం విజృంభించింది మరి. అంతకుముందు నెలతో పోల్చితే గత నెలలో దాదాపు 50 బేసిస్ పాయింట్లు ఎగిసి 3.93 శాతంగా నమోదైంది. ఏప్రిల్‌లో 3.48 శాతంగానే ఉన్న విషయం తెలిసిందే. పెరుగుతున్న పెట్రో ధరలు, ఆహారోత్పత్తుల ధరలే ఇందుకు కారణమని శుక్రవారం విడుదలైన కేంద్ర ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి. దేశీయ మార్కెట్‌లో మే 15 నుంచి లీటర్ పెట్రోల్, డీజిల్ రేట్లు దాదాపు రూ.8 చొప్పున, గృహావసరాలకు వినియోగించే వంటగ్యాస్ ధర సుమారు రూ.90 పెరిగిన సంగతి విదితమే. ఈ క్రమంలో పెరిగిన రవాణా ఖర్చులు.. అన్ని వస్తూత్పత్తుల ధరల్ని ఎగదోస్తున్నాయని ఆర్థిక నిపుణులు ప్రస్తుత పరిస్థితిని విశ్లేషిస్తున్నారు. ఇప్పటిదాకా పెరిగిన ఇంధన ధరలు.. నేరుగా ద్రవ్యోల్బణాన్ని 36 బేసిస్ పాయింట్లు పెంచాయని తేటతెల్లమవుతున్నది.

**ఆహార ద్రవ్యోల్బణం సెగ**

ఈసారి మే నెలలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ఆహార ద్రవ్యోల్బణం 4.78 శాతంగా ఉన్నది. ఏప్రిల్‌లో 4.2 శాతంగా నమోదైనట్టు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) చెప్తున్నది. ఈ క్రమంలో ఈసారి వర్షపాతం దేశ ఆర్థిక వ్యవస్థ కదలికల్నే ప్రభావితం చేయగలదన్న అంచనాలు వినిపిస్తున్నాయి. దేశంలో ఎక్కువగా వర్షాధార పంటలేనన్నది తెలిసిందే. దీంతో ఈసారి వర్షాలు సమృద్ధిగా కురువకపోతే.. సహజంగానే పంట దిగుబడులపై ఆ ప్రభావం కనిపిస్తుంది. ఇదే జరిగితే ఆహార ద్రవ్యోల్బణం, ఆ సెగతో రిటైల్ ద్రవ్యోల్బణం ఇంకా పెరుగడం ఖాయమే. ఇప్పటికే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఈ ఆర్థిక సంవత్సరానికి (2026-27)గాను ద్రవ్యోల్బణం అంచనాలను పెంచేసింది. 5.1 శాతంగా నమోదు కావచ్చున్నది. వర్షాభావ పరిస్థితులే ఏర్పడితే ఈ స్థాయిని మించి ద్రవ్యోల్బణ గణాంకాలు పరుగులు పెడుతాయని ఎక్స్‌పర్ట్స్ హెచ్చరిస్తున్నారు. ఇక రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి కట్టడి చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 6 శాతాన్ని దాటనీయరాదని ఆర్బీఐకి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల సారాంశం. కానీ వాస్తవ పరిస్థితులు.. ఆ టార్గెట్‌ను దాటేసేలా ఉండటం గమనార్హం.




**ఇదీ సంగతి..**

బంగారం, వెండి తదితర విలువైన లోహాల ఆభరణాలతో పాటు టమాట వంటి పలు కూరగాయల ధరలు బాగా పెరిగాయి. రిటైల్ మార్కెట్‌లో ప్రస్తుతం కిలో టమాట రేటు రూ.60కిపైగానే పలుకుతున్నది చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలోనే ఆలుగడ్డ తదితర కూరగాయలు, వాహనాల ధరలు తక్కువగా ఉన్నా.. తుది గణాంకాలపై ప్రభావం చూపలేకపోయాయన్న విశ్లేషణలు వస్తున్నాయి. కాగా, అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధంతో గల్ఫ్ దేశాల్లో ముడి చమురు, సహజ వాయువు ఉత్పత్తికి తీవ్ర ఆటంకం కలుగుతున్నది. సరుకు రవాణాకు కీలకమైన హొర్ముజ్ జలసంధి మూసివేత కూడా అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరల్ని పెంచేస్తున్నాయి. ఇరాన్‌పై అమెరికా దాడులు, ఇరాన్ తమ పొరుగు దేశాలపై ప్రతిదాడులతో ఇప్పట్లో మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టేలా లేవు. ఈ నేపథ్యంలో దిగుమతుల ద్వారానే దాదాపు 90 శాతం ఇంధన అవసరాలను తీర్చుకుంటున్న భారత్‌కు మున్ముందు ఇబ్బందులేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పెరిగే పెట్రో ధరలతో ద్రవ్యోల్బణం రాబోయే నెలల్లో గణనీయంగా పెరిగే సంకేతాలే కనిపిసున్నాయి.

**ధరల్లో తెలంగాణ టాప్**

రాష్ట్రంలో అధిక ధరలు.. వినియోగదారుల టాప్ లేపేస్తున్నాయి. జాతీయ ద్రవ్యోల్బణం గణాంకాలకు ఇంచుమించు రెట్టింపు స్థాయిలో నమోదవుతున్న రాష్ట్ర ద్రవ్యోల్బణం గణాంకాలే ఇందుకు నిదర్శనం. గత నెల మేలోనూ దేశంలో మరే రాష్ట్రంలో లేనంతగా తెలంగాణ రిటైల్ ద్రవ్యోల్బణం రికార్డైంది. ఏకంగా 6.15 శాతంగా నమోదైంది. ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా తెలంగాణలో నమోదైన ద్రవ్యోల్బణం గణాంకాలే రాష్ట్రాలవారీగా చూసినట్లైతే టాప్‌లో ఉండటం గమనార్హం. ముఖ్యంగా ఆహారోత్పత్తుల ధరలు ఠారెత్తిస్తున్నాయి. దీంతో సామాన్య కుటుంబాల వంటింటి బడ్జెట్ తలకిందులైపోతున్నది. దాదాపు అన్ని కూరగాయల రేట్లు కిలో రూ.80-120 స్థాయిలో ఉన్నాయి మరి. పప్పు ధాన్యాలు, వంట నూనెలు, ఇతర ఆహారోత్పత్తుల పరిస్థితి ఇలాగే ఉన్నది. దీంతో ధరల అదుపులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి

## భారీ లాభాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..
## సెన్సెక్స్ 1,695 పాయింట్లు పైకి.. ఒక్కరోజే 9.7 లక్షల కోట్ల సంపద పెంపు

భారతీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలు చవిచూశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ ఏకంగా 1695 పాయింట్లు లాభపడింది. నిఫ్టీ కూడా అత్యధికంగా 461.30 పాయింట్లు పైకి ఎగసింది. ట్రేడింగ్ ఉదయం భారీ లాభాల్లో 74,709.27 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఒక దశలో సెన్సెక్స్ 75,608.02 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. చివరకు 1695.40 పాయింట్ల లాభంతో 75,527.95 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ కూడా రోజంతా లాభాల్లోనే కొనసాగింది. చివరకు 461.30 పాయింట్ల లాభంతో 23,622.90 పాయింట్ల వద్ద ముగిసింది. భారీ లాభాల కారణంగా స్టాక్ మార్కెట్ ఈ ఒక్కరోజే ఏకంగా రూ.9.7 లక్షల కోట్లు అర్జించింది. దీంతో భారత స్టాక్ మార్కెట్ విలువ రూ.452.33 లక్షల కోట్ల నుంచి రూ.462.05 లక్షల కోట్లకు పెరిగింది. సెన్సెక్స్ 20 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్, ఇండిగో, ఎల్‌అండ్‌టీ, టైటాన్ షేర్లు లాభపడగా, టెక్ మహీంద్రా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గాయి. శుక్రవారం బ్రెంట్ బ్యారెల్ క్రూడాయిల్ ధర 86 డాలర్లుగా ఉంది. బంగారం ఔన్స్ ధర కూడా తగ్గి, 4224 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 95.11గా ఉంది. ఇరాన్, అమెరికా మధ్య ఉద్రిక్తతలు తగ్గడం, శాంతి ఒప్పందం కుదిరే అవకాశం ఉండటం, అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గడం మార్కెట్‌కు కలిసొచ్చింది.



# భారత తుది జట్టు ఇదే!



పొట్టి క్రికెట్ మహా సంగ్రామానికి సమయం ఆసన్నమైంది. ఇంగ్లండ్ వేదికగా జూన్ 12- జూలై 5 మధ్య ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్-2026 టోర్నీకి షెడ్యూల్ ఖరారైంది. ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఇంగ్లండ్- శ్రీలంక మధ్య శుక్రవారం ఈ మెగా ఈవెంట్‌కు తెరలేవనుంది. ఇక భారత మహిళా జట్టు తమ తొలి మ్యాచ్‌లోనే దాయాది పాకిస్తాన్‌ను ఎదుర్కోనుంది. ఎడ్జ్‌బాస్టన్‌లో ఆదివారం (జూన్ 14) ఇరుజట్లు ముఖాముఖి తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ పాక్‌తో తలపడే భారత తుదిజట్టుపై తన అంచనా తెలియజేశాడు. "ఓపెనర్‌గా షఫాలీ వర్మనే సరైన ఆప్షన్. ఆమెకు తోడుగా వైస్ కెప్టెన్ స్మృతి మంధాన ఉండనే ఉంది. యస్తికా భాటియా కూడా అద్భుతంగా ఆడుతోంది. మూడో స్థానంలో ఆమెను ఆడించాలి. నాలుగో స్థానంలో జెమీమా రోడ్రిగ్స్, ఐదో స్థానంలో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఆడుతుంది. రిచా ఘోష్ ఆరో స్థానంలో పవర్ హిట్టర్‌గా సేవలు అందించగలదు. భారతి ఫుల్మాలిని ఎంపిక చేయాలనే ఉంది. కానీ రాధా యాదవ్‌తో పోలిస్తే ఆమె కాస్త వెనుబడి ఉన్నట్లు అనిపిస్తోంది. కాబట్టి ఫినిషర్‌గా రాణించగల లెఫ్టార్మ్ స్పిన్నర్ రాధా యాదవ్‌నే నేను ఎంచుకుంటాను. ఆ తర్వాతి స్థానంలో దీప్తి శర్మ ఉంటుంది. క్రాంతి గౌడ్, అరుంధతి రెడ్డి, శ్రీచరణి బౌలింగ్ విభాగంలో సేవలు అందిస్తారు" అని అభిషేక్ నాయర్ స్టార్ స్పోర్ట్స్ షోలో తన అభిప్రాయాలు పంచుకున్నాడు. పాకిస్తాన్‌తో మ్యాచ్‌కు అభిషేక్ నాయర్ ఎంచుకున్న భారత తుదిజట్టు

షఫాలీ వర్మ, స్మృతి మంధాన, యస్తికా భాటియా, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్, రిచా ఘోష్, రాధా యాదవ్, దీప్తి శర్మ, అరుంధతి రెడ్డి, శ్రీచరణి, క్రాంతి గౌడ్.


### అతడిని విస్మరించొద్దు..
### సెలెక్టర్లకు మాజీ క్రికెటర్ హెచ్చరిక!



టీమిండియా వికెట్ కీపర్ రిషబ్ పంత్ టెస్టు క్రికెట్‌లో వేగంగా ఆడుతాడనే పేరుంది. కానీ వన్డే, టీ20 క్రికెట్‌లో మాత్రం పంత్ ఆట పూర్తి విరుద్ధంగా ఉంటుంది. వేగంగా ఆడాల్సిన వన్డే, టీ20 క్రికెట్‌లో సరిగ్గా ఆడకపోవడం.. ఆచితూచి ఆడాల్సిన టెస్టు క్రికెట్‌లో వేగాన్ని చూపించడం పంత్ నైజం. అయితే ఇటీవలే పేలవ ఫామ్ కారణంగా వన్డే, టీ20 క్రికెట్‌లో చోటు కోల్పోయిన పంత్ టెస్టు జట్టులో మాత్రం స్థానం నిలుపుకున్నాడు. అయితే పరిమిత ఓవర్ల ఆటలో పంత్ ఆట ఇక ముగిసినట్లేనని అభిప్రాయాలు వ్యక్తమవుతున్న వేళ టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ కీలకవ్యాఖ్యలు చేశాడు. జియో హాట్‌స్టార్ ఇంటర్వ్యూలో పఠాన్ మాట్లాడాడు. పంత్‌ను వైట్‌బాల్ జట్టు నుంచి తొలగించినప్పటికీ 2027 వన్డే ప్రపంచకప్ నేపథ్యంలో అతడిని పూర్తిగా విస్మరించివద్దని సెలెక్షన్ కమిటీని కోరాడు. 'వన్డే క్రికెట్ నుంచి తప్పించారనే నిరాశ వాదాన్ని వదిలేసి మళ్లీ ట్రాక్ ఎక్కితే పరిమిత ఓవర్ల క్రికెట్‌లో టీమిండియాలో చోటు దక్కించుకోవడం పంత్‌కు పెద్ద కష్టమేమి కాదు. ఈ విషయంలో పంత్ తన సహచర క్రికెటర్లను ఆదర్శంగా తీసుకోవాలి. వన్డేల్లో వికెట్ కీపర్ ఇప్పుడు కేఎల్ రాహుల్ తొలి ఛాయిస్. ఓపెనర్‌గా, అవసరమైతే ఐదు లేదా ఆరో స్థానంలోనూ బ్యాటింగ్ చేయగలడు. అతడికి బ్యాకప్‌గా ఇషాన్ కిషన్ ను తీసుకొచ్చారు. ఇషాన్ కూడా టాపార్డర్‌లో బ్యాటింగ్ చేస్తాడు. షార్ట్‌పిచ్ బంతులను కూడా చక్కగా ఆడగలడు. బీసీసీఐకి మూడో ఆప్షన్ సంజు శాంసన్. అతడికి ఎప్పుడు అవకాశం వచ్చినా వన్డేల్లో సత్తా చాటడంలో ముందుంటాడు. గత టీ20 ప్రపంచకప్‌లోనూ శాంసన్ పలు కీలక ఇన్నింగ్స్ లు ఆడటం చూశాం. పంత్ విషయంలో మాత్రం సెలక్టర్లకు ఒక విజ్ఞప్తి చేస్తున్నా. 2027 వన్డే ప్రపంచ కప్ సెలక్షన్స్‌లో పూర్తిగా అతడిని పక్కన పెట్టొద్దు. పరిమిత ఓవర్ల క్రికెట్లో అతడి ఫామ్ గొప్పగా లేదని తెలుసు. గతంలో ఇషాన్ కిషన్ కూడా జట్టులో నుంచి బయటకు వెళ్లాడు. తర్వాత రాణించి మళ్లీ జట్టులోకి ఎంట్రీ ఇచ్చాడు. సారథిగా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని జార్ఖండ్‌కు అందించాడు. అందుకే అతడిని పంత్ స్ఫూర్తిగా తీసుకోవాలి. వైట్‌బాల్ క్రికెట్‌లోకి గ్రాండ్ రీఎంట్రీ ఇవ్వాలి.' అని ఇర్ఫాన్ తెలిపాడు. పంత్ చివరిసారిగా 2024లో వన్డే మ్యాచ్ ఆడాడు. 2025 చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన టీమిండియా జట్టులో ఉన్నప్పటికీ రిజర్వ్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఈ ఏడాది ఐపీఎల్ సీజన్‌లోనూ పంత్ కెప్టెన్‌గా, ఆటగాడిగా విఫలమయ్యాడు. లక్నో సూపర్‌జెయింట్స్ తరఫున 14 మ్యాచ్‌లాడిన పంత్ 312 పరుగులు మాత్రమే చేయగలిగాడు.


## స్పోర్ట్స్

### దోహా డైమండ్ లీగ్‌కు నీరజ్ చోప్రా దూరం..!




లపారిస్ ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా మరో మెగా ఈవెంట్‌కు దూరమయ్యాడు. గాయంతో బాధ పడుతున్న చోప్రా ప్రతిష్ఠాత్మక దోహా డైమండ్ లీగ్ నుంచి వైదొలిగాడు. వెన్ను గాయం నుంచి కోలుకుంటున్న అతడు జూన్ 19 నుంచి మొదలయ్యే మెగా ఈవెంట్‌లో పాల్గొనడం లేదు. దాంతో, నిరుడు ఇదే లీగ్‌లో 90 మీటర్ల దూరం ఈటెను విసిరిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ ఆటను అభిమానులు మిస్ కానున్నారు. ఈ మధ్య కాలంలో గాయాల కారణంగా పలు టోర్నీలకు డుమ్మా కొడుతున్న నీరజ్ చోప్రా ఈటెను పట్టేందుకు మరింత సమయం పట్టనుంది. ప్రస్తుతం నీరజ్ వెన్నెముక గాయం నుంచి కోలుకుంటుండడమే అందుకు కారణం. ఫలితంగా జూన్ 19 నుంచి జరిగే దోహా డైమండ్ లీగ్‌కు చోప్రా దూరమయ్యాడు. త్వరలో జరుగబోయే కామన్‌వెల్త్ గేమ్స్, ఆసియా క్రీడలే లక్ష్యంగా పెట్టుకున్న నీరజ్.. సైకోథెరపిస్ట్ ఇషాన్ మర్వాహ, కోచ్ జై చౌదరీ సాయంతో స్విట్జర్‌లాండ్‌లోని బీయెన్నేలో 47 రోజుల శిక్షణ తీసుకుంటున్నాడు.

తెలుగు జ్యోతి
అనుక్షణం జనం కోసం జాతీయ దినపత్రిక



# పోరాటాల భోగి

చార్మింగ్ హీరో శర్వానంద్ నటిస్తున్న పానిండియా పిరియడ్ యాక్షన్ డ్రామా 'భోగి'. సంపత్‌నంది దర్శకత్వంలో కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. ఇప్పటికే ఈ సినిమా ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభించిందని మేకర్స్ చెబుతున్నారు. ప్రస్తుతం కళాదర్శకుడు కిరణ్‌కుమార్ మన్నె ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో క్లైమాక్స్ యాక్షన్ సీక్వెన్స్‌ని చిత్రీకరిస్తున్నారు. స్టంట్ కొరియోగ్రాఫర్ దిలీప్ సుబ్బరాయన్ నేతృత్వంలో తెరకెక్కిస్తున్న ఈ పోరాట సన్నివేశాలు ప్రేక్షకులకు గొప్ప థియేట్రికల్ అనుభూతిని అందిస్తాయని, శర్వానంద్ తన రిస్కీ స్టంట్లతో సరికొత్త కోణాన్ని తెరపై ఆవిష్కరించనున్నారని మేకర్స్ చెబుతున్నారు. 20రోజుల పాటు జరిగే ఈ షెడ్యూల్‌లో సినిమాకు చెందిన కీలక భాగం పూర్తి కానున్నది. 1960ల నేపథ్యంలో తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని ఓ ఫిక్షనల్ విలేజ్‌లో జరిగే పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతున్నదని, శర్వా కెరీర్‌లోనే చెప్పుకోదగ్గ సినిమాగా ఇది నిలుస్తుందని మేకర్స్ నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కిశోర్‌కుమార్ ఆరోకియా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సమర్పణ: లక్ష్మీ రాధామోహన్, నిర్మాణం: శ్రీసత్యసాయి ఆర్ట్స్.

# సత్యదేవ్ సాహసం.. రావు బహదూర్ టీజర్ రిలీజ్



సత్యదేవ్ హీరోగా వస్తోన్న లేటెస్ట్ మూవీ రావు బహదూర్. ఈ చిత్రాన్ని దర్శకుడు వెంకటేష్ మహా తెరకెక్కిస్తున్నారు. గతంలో ఆయన డైరెక్ట్ చేసిన 'కేరాఫ్ కంచరపాలెం, ఉమామహేశ్వర ఉగ్రరూపస్య' చిత్రాలు టాలీవుడ్‌లో మంచి విజయాన్ని అందుకున్నాయి. మహేశ్‌బాబు, నమ్రాతా శిరోద్కర్ సొంత నిర్మాణ సంస్థ జీఎంబీ ఎంటైర్టైన్మెంట్స్ సమర్పణలో నిర్మిస్తున్నారు. సైకలాజికల్ థ్రిల్లర్ కాన్సెప్ట్‌తో ఈ మూవీ రానుంది. తాజాగా ఈ మూవీ టీజర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇందులో సత్యదేవ్ రోల్ చూస్తుంటే విభిన్నంగా ఉండనుందని తెలుస్తోంది. డిఫరెంట్ లుక్స్‌లో సత్యదేవ్ అదరగొట్టేశారని అర్థమవుతోంది. ఈ ప్రాజెక్ట్‌లో సత్యదేవ్ పాత్ర సరికొత్తగా ఉండనుందని టీజర్‌తోనే స్పష్టమవుతోంది. ఈ చిత్రంలో వికాస్ ముప్పాల, దీపా థామస్, బాల పరాసర్, ఆనంద్ భారతి, ప్రణయ్ వాక, కునాల్ కౌశిక్, మాస్టర్ కిరణ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీ జూలై 3న థియేటర్లలో సందడి చేయనుంది.

## నాగ్ 'సోగ్గాడే' సీక్వెల్ వాయిదా?.. ట్రాక్‌లోకి కింగ్ 100వ చిత్రం

కింగ్ అక్కినేని నాగార్జున ప్రతిష్టాత్మక 100వ చిత్రాన్ని 2027 సంక్రాంతి బరిలో దించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో గతంలో అన్నపూర్ణ స్టూడియోస్ ప్రకటించిన 'సోగ్గాడే చిన్ని నాయన' సీక్వెల్ ప్రస్తుతానికి పక్కకు వెళ్లినట్లు ఇండస్ట్రీ వర్గాల నుంచి సమాచారం. రా కార్తీక్ దర్శకత్వంలో క్రైమ్ అండ్ మనీ హీస్ట్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న నాగ్ 100వ సినిమా షూటింగ్ ఇప్పటికే సగానికి పైగా పూర్తయింది. ఈ ఏడాది ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు 'జైలర్ 2', 'విశ్వంభర', 'స్వయంభు' వంటి భారీ పాన్-ఇండియా చిత్రాలు విడుదలకు క్యూ కట్టడంతో, వాటితో పోటీ పడకుండా నేరుగా సంక్రాంతి సీజన్‌లో రావడమే మంచిదని నాగార్జున భావిస్తున్నట్లు సమాచారం. ఈ సినిమాలో చాలా కాలం తర్వాత ఈ చిత్రంలో నాగార్జున సరసన టబు నటిస్తుండగా, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. యంగ్ డైరెక్టర్ అయినప్పటికీ రా కార్తీక్ ఈ పీరియాడిక్ కథను, నాగార్జున విభిన్న షేడ్స్ లుక్‌ను అద్భుతంగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో నాగ్ లుక్ కోసం 'డీ-ఏజింగ్' టెక్నాలజీని కూడా వాడుతున్నారట. దసరా కానుకగా ఈ సినిమా ఫస్ట్ టీజర్ వచ్చే అవకాశం ఉంది.



# వెంకీమామ- అనిల్ రావిపూడి కాంబో.. బీచ్‌లో క్రేజీ అప్‌డేట్



ప్రతి సంక్రాంతికి హిట్ కొడుతున్న టాలీవుడ్ డైరెక్టర్ అనిల్ రావిపూడి. ఈ ఏడాది కూడా మనశంకరవరప్రసాద్‌గారు మూవీతో సూపర్ హిట్ అందుకున్నారు. చిరంజీవి- వెంకీతో కలిసి ఫుల్ ఎంటర్‌టైన్ చేశారు. వీరిద్దరి కాంబోలో బాగానే వర్కవుట్ అయింది. ఇద్దరు స్టార్స్‌ను తీసుకుని కామెడీ ఎంటర్‌టైనర్ తెరకెక్కించడం ఒక్క అనిల్ రావిపూడికే సాధ్యమని టాలీవుడ్ సినీ ప్రియులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి కూడా మరోసారి టాలీవుడ్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. సంక్రాంతికి వస్తున్నాం అంటూ వెంకీమామతో బ్లాక్‌బస్టర్ కొట్టిన అనిల్.. మరోసారి ఎంటర్‌టైన్ చేసేందుకు వచ్చేస్తున్నారు. వెంకీతో పాటు కల్యాణ్ రామ్ కూడా ఈ సినిమాలో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ స్క్రిప్ట్ దాదాపు రెడీ అయిపోయింది. త్వరలోనే ఈ మూవీ సెట్స్ పైకి వెళ్లనుంది. ఈ నేపథ్యంలోనే అనిల్ రావిపూడి క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్‌కుమార్‌ను మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎంచుకున్నారు. ఈ విషయాన్ని రోటీన్‌గా కాకుండా చాలా క్రేజీగా అనౌన్స్ చేశారు. వివాహ భోజనంబు చిత్రంలోని సుత్తి వీరభద్రరావు, బ్రహ్మానందం మధ్య బీచ్‌లో జరిగే ఓ సన్నివేశాన్ని రీక్రియేట్ చేశారు. ఈ వీడియో చాలా ఫన్నీగా ఆడియన్స్‌ను అలరిస్తోంది. ఆ సినిమాలో లాగే బీచ్‌లో జీవీ ప్రకాశ్‌ను ఇసుకలో పూడ్చి మరి మ్యూజిక్ కంపోజ్ చేయించారు. ఆ తర్వాత పాటల రచయితగా అనంత శ్రీరామ్ పని చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మూవీ ఇంకా సెట్స్‌పైకి వెళ్లకముందే అప్‌డేట్స్‌తో అనిల్ రావిపూడి సరికొత్తగా దూసుకెళ్తున్నారు. దీంతో వెంకీ మామ ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ అవుతున్నారు.



# ప్రియదర్శి హీరోగా సుకుమార్, బన్నీవాస్ సినిమా

టాలీవుడ్‌లో ఇంట్రెస్టింగ్ కాంబో రెడీ అవుతున్నది. పానిండియా దర్శకుడు సుకుమార్, ప్రముఖ యువ నిర్మాత బన్నీ వాస్ కలిసి ప్రియదర్శి హీరోగా ఓ చిత్రాన్ని నిర్మించబోతున్నారు. బన్నీ వాస్ వర్క్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి దర్శకుడెవరు? ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరు? అనే విషయాలు త్వరలో మేకర్స్ వెల్లడించనున్నారు. క్రేజీ కాంబినేషన్‌లో రానున్న ఈ కొత్త సినిమా.. సినీ వర్గాల్లో ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

# గ్రామీణ కథతో డైరెక్షన్

హీరో కిరణ్ అబ్బవరం దర్శకుడిగా మెగాఫోన్ పట్టారు. ఆయన హీరోగా నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న కొత్త సినిమా చిత్రీకరణ శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. దేవిక భట్ హీరోయిన్‌గా నటించనున్న ఈ చిత్రంలో శరత్‌కుమార్, సాయికుమార్ ప్రధాన పాత్రల్లో నటించనున్నారు. ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ సుధాకర్ చాగంటి ఈ సినిమాను నిర్మిస్తుండగా సురేష్ ఎర్ర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ప్రీ లుక్ తరహాలో శుక్రవారం ఈ సినిమా కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'ఏక్ దమ్ బిందాస్ పకానే వాలే' అన్నది ఈ సినిమా ట్యాగ్‌లైన్. "దర్శకుడిగా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్ కథను సిద్ధం చేశారు కిరణ్ అబ్బవరం. ఈ చిత్రానికి కిరణ్ కథారచయితగా, హీరోగా, స్క్రీన్ ప్లే రైటర్‌గా, దర్శకుడిగా చేస్తున్నారు. యూత్‌ను, కుటుంబ ప్రేక్షకులను మెప్పించే ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుంది" అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: విశ్వాస్ డేనియల్.



Printer, publisher and Owned by DUVVALA SHEKAR YADAV, Published from PLOT NO, 427, H NO 6-1-4, PRASHANTH NAGAR, MIYAPUR, HYDERABAD, TELANGANA - 500049.
Printed from NALIVELI EXPRESS, MAIN ROAD, PATTIKONDA, KURNOOL, ANDHRA PRADESH - 518380. Editor: DUVVALA SHEKAR YADAV, PRGI NO TGTEL/25/A2223